ఆంధ్రజ్యోతి

**** ఇఫ్తార్ : 6.30 | సహర్ : 5.08 (శనివారం)

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శుక్రవారం 7 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 , కనిష్ఠం 21.6

డీఎస్‌వో పోస్టుకోసం
జోరుగా పైరవీలు

- తీవ్రంగా యత్నిస్తున్న ముగ్గురు అధికారులు
- ఎక్స్‌టెన్షన్ కోసం రిటైర్డ్ అధికారి సైతం
- వారం రోజులుగా ఎవరికీ బాధ్యతలివ్వకపోవడానికి కారణమేంటనే చర్చ
- రాష్ట్రంలోనే హాట్‌కేక్‌గా మారిన పోస్టు



నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి పోస్టు కోసం పెద్ద ఎత్తున పైరవీలు సాగుతున్నాయి. రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లా కావడం, కీలకమైన రైస్ ఇండస్ట్రీ ఈ జిల్లాలోనే ఉండడంతో ఈ పోస్టుకు ఇతర అన్ని జిల్లాల కంటే అత్యధిక ప్రాధాన్యం ఉంటుంది. ఇక్కడ డీఎస్‌వోగా పనిచేసేందుకు సీనియర్ అధికారులు సైతం కీలక మంత్రులు, ఉన్నతాధికారుల ఆశీస్సుల కోసం తాపత్రయపడుతుంటారు. ఈ పోస్టుకోసం సర్వీసులో ఉన్న అధికారులు ఓ వైపు ప్రయత్నిస్తుంటే, మరో వైపు ఇటీవలే ఉద్యోగ విరమణ చెందిన మరో అధికారి ఎక్స్‌టెన్షన్ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది. ఆయన ఉద్యోగ విరమణ చేసి వారం రోజులు గడుస్తున్నా కొత్త అధికారి రాకపోగా, కనీసం ఇన్‌చార్జిని సైతం నియమించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఉన్నతస్థాయిలో కీలక ప్రయత్నాలు

జిల్లా పౌరసఫరాల అధికారి పోస్టు కోసం ఆ శాఖలో కీలకమైన అధికారులు ఉన్నతస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పోస్టు ఆశిస్తున్న ముగ్గురు అధికారులతో పాటు, ఉద్యోగ విరమణ చెందిన అధికారి సైతం ఎక్స్‌టెన్షన్ వస్తుందనే ఆశాభావంలో ఉన్నట్లు అధికారిక వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో గతంలో పనిచేసిన ఓ అధికారి అందుకోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తుండగా, మరో ఇద్దరు ఇతర జిల్లాల అధికారులు సైతం ఈ పోస్టు కోసం ఉన్నతాధికారులు, మంత్రుల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. ఉన్నతాధికారుల నుంచి ఈ ఆశావహులకు ఎలాంటి హామీ దక్కలేదని, గురువారం క్యాబినెట్ సమావేశం తర్వాత మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఖరారు చేయాల్సి ఉంటుందని, ఓ ఆశావహ అధికారికి, ఉన్నత స్థాయి అధికారి తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో పోస్టింగు ఖరారయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని సమాచారం.

ఎక్స్‌టెన్షన్ దక్కేనా..?

డీఎస్‌వోగా ఫిబ్రవరి 28 వరకు బాధ్యతలు నిర్వర్తించిన అధికారికి ఎక్స్‌టెన్షన్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు చర్చ సాగుతోంది. శాఖపై పట్టుండడంతో పాటు, కీలకమైన జిల్లా కావడంతో వివాదాల్లేకుండా నెట్టుకొచ్చిన ట్రాక్‌రికార్డు ఉండడంతో ఆయన్ను కొనసాగించే అవకాశాలను పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారని చెబుతున్నారు. అయితే గత ప్రభుత్వం హయంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు మాత్రమే ఈ రకమైన సర్వీస్ ఎక్స్‌టెన్షన్ ఇచ్చారని, అదీ వారి సీనియారిటీని ఉపయోగించుకోవాలనే కారణాన్ని చూపుతూ ఉత్తర్వులిచ్చారని, జిల్లా

మిగతా 8వ పేజీలో...

పోలీస్ సేవలు



మరింత చేరువగా

- త్వరలో పెరగనున్న పోలీస్ స్టేషన్ల స్థాయి
- నేరాల సంఖ్య ఎక్కువగా నమోదవుతున్న స్టేషన్ల అప్‌గ్రేడ్
- ప్రత్యేకంగా ఏర్పాటుకానున్న సూర్యాపేట టూటౌన్ స్టేషన్
- సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంతో నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు
- జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా?



సూర్యాపేటక్రైం, మార్చి 6, (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు రాజీ లేకుండా విధులు నిర్వహిస్తున్నా రోజు రోజుకూ నేరాల సంఖ్య పెరుగుతూనే ఉంది. అంతేగాక తీవ్ర నేరాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిని అరికట్టాలంటే ప్రస్తుతం ఉన్న పోలీసులతో పాటు అదనంగా పోలీసులు, స్టేషన్లు అవసరం. దీంతో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పోలీస్ అధికారుల సమీక్షలో నేరాల సంఖ్య ఎక్కువగా ఉన్న స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయడం, అవసరం ఉన్న చోట నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న పోలీసులకు అదనంగా సిబ్బంది నియామకం చేపట్టాలని నిర్ణయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లు అప్‌గ్రేడ్ కానున్నాయి. దీంతో మహిళా పోలీస్‌స్టేషన్లు, సూర్యాపేట పట్టణంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కానున్నాయి.

గతంలో ఉమ్మడి జిల్లాలో పని చేసిన ఎస్పీలు గత ప్రభుత్వానికి అప్‌గ్రేడ్ చేయాల్సిన స్టేషన్లు, నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుపై నివేదిక పంపారు. కానీ, అవి అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో త్వరలో ఈ ప్రతిపాదనలు అమలవుతాయని అంతా భావిస్తున్నారు.

పలు స్టేషన్ల అప్‌గ్రేడ్‌కు అవకాశం

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు సూర్యాపేట జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎస్ఐ ఎస్‌హెచ్‌వోగా కొనసాగుతున్న తిరుమలగిరి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, చివ్వెంల పోలీస్‌స్టేషన్లను ఎస్‌హెచ్‌వో ఇన్‌స్పెక్టర్ స్థాయికి పెంచనున్నారు. ఈ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏటా నేరాల సంఖ్య పెరగడంతో పాటు తిరుమలగిరి, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మునిసిపాలిటీలుగా ఏర్పడ్డాయి. దీంతో అక్కడ జనాభా పెరిగింది. చివ్వెంల పరిధిలో జాతీయ రహదారి 65, ఖమ్మం రహదారి, దంతాలపల్లి రహదారులున్నాయి. ఈ రహదారులపై నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతోపాటు చివ్వెంల మండల పరిధిలో నేరాల నమోదు కూడా ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు ఇప్పటికే జిల్లా ఎస్పీలు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. సూర్యాపేట రూరల్, కోదాడ పట్టణం, కోదాడ రూరల్, సూర్యాపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో సిబ్బందిని పెంచాలని, సూర్యాపేట టూటౌన్ స్టేషన్‌ను ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా అప్‌గ్రేడ్ చేయాలని ఇటీవల ప్రభుత్వానికి జిల్లా ఎస్పీ నన్‌ప్రీత్‌సింగ్ నివేదికను పంపినట్లు సమాచారం.

పేటలో టూటౌన్ స్టేషన్

సూర్యాపేట పట్టణ జనాభా 1.50లక్షలకు పైగా చేరింది. అంతేగాక జిల్లా కేంద్రంగా ఏర్పాటైంది. నిత్యం వేల మంది వివిధ ప్రాంతాల నుంచి పలు పనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. గతంలో

మిగతా 7వ పేజీలో...

జానా ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో జానా, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీఎల్పీ మాజీ నేత కందూరు జానారెడ్డి నివాసానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జానా ఇంటికి వచ్చిన సీఎం సుమారు 30నిమిషాల పాటు ఆయనతో ఏకాంతంగా చర్చించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎంపిక, అదే విధంగా పలు అంశాలపై చర్చించినట్టు సమాచారం. అనంతరం జానా నివాసంలో సీఎం భోజనం చేసి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, జానా ఇంటికి వచ్చిన సీఎంను నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత బైరెడ్డి కోటిరెడ్డి కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు.

సెకండియర్‌లో 332మంది గైర్హాజరు



జిల్లా కేంద్రంలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభం కాగా, తొలి రోజు 332 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 13,295మంది విద్యార్థులకు 12,963మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 11,135మందికి 10,891మంది హాజరు కాగా, 244మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,160మంది విద్యార్థులకు 2,072మంది హాజరు కాగా, 88మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

పొరపాట్లు లేకుండా చూడాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఇంటర్ పరీక్షల సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

కల్తీ రహిత ఆహారం అందేలా చూడాలి : కలెక్టర్

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు కల్తీ రహిత ఆహారం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆహార భద్రతశాఖ ఆధ్వర్యంలో నల్లగొండలో ఏర్పాటు చేసిన ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఆహార పదార్థాల్లో కల్తీ ఉందో లేదో అనే విషయంపై పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు రహదారుల పక్కన ఉన్న చిన్న వ్యాపారస్థులు, హోటళ్లలో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వ్యాపారులు, హోటళ్లు కల్తీ పదార్థాలు విక్రయించకుండా నివారించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ జోనల్ అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు వాహనాన్ని జిల్లాకు కేటాయించారని, ఈ వాహనం ద్వారా స్థానికంగా పరీక్షలు నిర్వహించి ఆహార నాణ్యతను నిర్ధారించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఆహార కల్తీపై ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు పి.స్వాతి, శివశంకర్‌రెడ్డి, ప్రభాకర్, పాల్గొన్నారు.

ఎంజీయూలో సదుపాయాల పరిశీలన

నీట్ పరీక్షా కేంద్రం ఏర్పాటు కోసం ఎంజీయూలో వసతలును కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం పరిశీలించారు. వారివెంట రిజిస్ట్రార్ అల్వాల రవి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవరకొండ మున్సిపాలిటీతోపాటు అన్ని గ్రామాల్లో సరిపడా తాగునీటిని సరఫరా చేసేలా మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి వెంటనే నీటిని సరఫరా చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తిచేసినచోట వెంటనే ఫొటోలను తీసి పంపించాలని, సాంకేతిక సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించే ముందు మార్కింగ్ చేసి సంబంధిత శాసనసభ్యుల ద్వారా ప్రారంభించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ, వర్షాకాలంలో నియోజకవర్గ పరిధిలో కురిసిన వర్షాలకు అన్ని చెరువులు, కుంటల్లోకి నీరు పుష్కలంగా వచ్చిందని, వచ్చే జూన్ వరకు ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అవసరమైతే అద్దె బోర్ల ద్వారా ప్రజలకు నీరందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, మొదటి ప్రాధాన్యంలో పూర్తిగా ఇల్లులేనివారికి, గుడిసెలో నివసిస్తున్నవారికి కేటాయించడం జరుగుతుందన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): మండల కేంద్రమైన కనగల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బ్యాంక్ నూతన శాఖను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కనగల్‌తో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజల సౌకర్యార్థం బ్యాంక్ నూతన శాఖ ఏర్పాటు చేసిందన్నారు. ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఎస్‌టీపీ ద్వారా రుణాలు, రైస్‌మిల్లు, దాల్ మిల్లు వంటి పరిశ్రమలకు రుణాలు అందజేస్తామని, బ్యాంక్ ప్రతినిధుల ద్వారా మారు గ్రామాలకు సైతం సేవలను విస్తరింప జేస్తామని బ్యాంక్ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఆర్.సత్యనారాయణ, తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ కారే భాస్కర్‌రావ్, జడ్పీ మాజీ సభ్యుడు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ పద్మ, డిప్యూటీ రీజనల్ మేనేజర్ మురళీకృష్ణ, రాజేష్, రఘురాం, కోటేశ్వరరావ్, బ్యాంక్ మేనేజర్ మోహన్, ఈశ్వర్, చంద్రశేఖర్, సతీష్‌రెడ్డి, ఆర్ఐ సునిత, తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధనగిరిధారిగా..



స్వామివారిని ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది

- సింహవాహనంపై దర్శనమిచ్చిన దేవదేవుడు
- యాదగిరిగుట్టలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

6లో..

ఢిల్లీలో చేనేత కళాకారుల ప్రదర్శన

పాల్గొన్న జిల్లా వాసులు



రాష్ట్రపతి భవన్‌లో చేనేత వస్త్రాలను ప్రదర్శిస్తున్న జాతీయ అవార్డు గ్రహీత గంజి యాదగిరి

చండూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వివిధ్‌తాకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహిస్తున్న చేనేత కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శనను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 20మంది చేనేత కళాకారులు ఈ ప్రదర్శనకు ఎంపిక కాగా, చండూరుకు చెందిన జాతీయ అవార్డు గ్రహీత గంజి యాదగిరి, జాతీయ మెరిట్ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసులు వారిలో ఉన్నారు. వీరు నైపుణ్యంతో తయారు చేసిన చేనేత ఉత్పత్తుల గురించి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వివరించారు. నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. పట్టణానికి చెందిన కళాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మత్తుకు బానిస కావద్దు



సమావేశంలో మాట్లాడుతున్న నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ భిక్షపతిరావు

రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ భిక్షపతిరావు

మర్రిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ భిక్షపతిరావు అన్నారు. గురువార మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నార్కోటిక్స్ బ్యూరో సీఐ సామ్యనాయక్, ఎస్ఐ కృష్ణారెడ్డి, ఎంఈవో బిట్టు శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంరక్షకుడే భక్షకుడు?

నకిలీ పాస్‌పుస్తకాల దందాలో విలేజ్ ఫారెస్ట్ కమిటీ మాజీ సభ్యుడు

6లో..

బాలుడి కిడ్నాప్..

కథ సుఖాంతం

6లో..

గోవర్ధనగిరిధారిగా ఏకశిఖరవాసుడు

యాదగిరిగుట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా కొనసాగుతున్నాయి. లోక కల్యాణం కోసం చేపట్టిన ఉత్సవాల్లో ఆరో రోజైన గురువారం యాదగిరీశుడిని 'గోవర్ధనగిరిధారి' అలంకరణలో భక్తులు సేవించారు. భక్తజన రక్షణే ధ్యేయంగా అవతారాలు దాల్చిన స్వామివారు ప్రకృతి బీభత్సం నుంచి కాపాడే భక్తజన బాంధవుడిగా శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింబించే అలంకరణలో దివ్య మనోహరంగా భక్తజనులకు దర్శనమిచ్చారు. తన చిటికెన వేలుతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టి గోపాలులను రక్షించిన మహిమలను అర్చకులు అలంకార విశిష్టతను భక్తులకు వివరించారు.భక్తుల గోవిందనామ స్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. ఉత్సవాలను ప్రధానార్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యులు, అర్చక బృందం, వేదపండితులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, జూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్‌గౌడ్, దీరావత్ రామరావు నాయక్, రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, దాసోజు నరేష్, రాకేష్‌రెడ్డి, ముద్దసాని నరేష్, వేముల వెంకటేశ్, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



గోవర్ధనగిరి ధారిగా స్వామి వారి అలంకారోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



సింహవాహన సేవలో స్వామి వారు

సింహ వాహనంలో నారసింహుడు

దుష్ట శిక్షణ..శిష్ట రక్షణకు నారసింహుడిగా అవతరించిన స్వామి వారు రాత్రి మృగరాజు సింహవాహనంపై భక్త జనుల పూజలు అందుకున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో రాత్రి వేళ దివ్యవాహన సేవలు అందుకోవడం ఆలయ సంప్రదాయం. పట్టువస్త్రాలు, ముత్యాల, బంగారు ఆభరణాలు, వజ్రవైడూర్యాలతో తేజోరూపుడు నారసింహుడు అడవికే రాజైన సింహ వాహనంపై అధిష్ఠించి భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునే స్వయంభువులను కొలుస్తూ నిత్యారాధనలు, ఆలయ మండపంలో దివ్య ప్రబంధ పారాయణాలు, మూలమంత్ర, మూర్తి మంత్ర జపాలు, క్షేత్ర మహాత్మ్యం పఠనాలను రుత్వికులు, అర్చకులు చేపట్టారు. యాగశాలలో పంచసూక్తాలు, మూల మంత్రాలతో హోమ పూజలు జరిపారు. అలంకార సేవకు దేవస్థాన కల్యాణ మండపంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుత్వికుల పారాయణాలు, మంగళవాయిద్యాల మధ్యన తిరువీధుల్లో ఊరేగారు. స్థానిక శ్రీ వైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరి సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణాలు జరిపారు.



కొండపై వేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవి వేషధారణలో కళాకారులు

సీఎం సిబ్బంది

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీఎం భద్రత సిబ్బంది ఆలయాన్ని సందర్శించారు. హైదరాబాద్ మొయినాబాద్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న సిబ్బంది క్షేత్రాన్ని సందర్శించారు.

• బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేష ఘట్టమైన అశ్వవాహన సేవలో ఎదుర్కోళ్ల ఉత్సవం రాత్రి నిర్వహిస్తారు. ఉదయం ప్రభాతభేరీ, తిరువీధుల్లోని యాగశాలలో హవనం, జగన్మోహిని అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారు.

నేటి నుంచి విశేష ఘట్టాలు

● మూడు రోజుల పాటు ప్రధాన ఘట్టాలు

ఏటా 11 రోజుల పాటు నిర్విఘ్నంగా సాగే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టాలైన ఎదుర్కోళ్ల ఉత్సవం(శుక్రవారం), తిరుకళ్యాణమహోత్సవం(శనివారం), దివ్యవిమాన రథోత్సవం(ఆదివారం) వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మూడు రోజుల పాటు కొండకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఇందుకోసం ఆలయ అధికారులు తాగునీరు, ప్రసాదాలు, ఉత్సవాల వేళ రెండు వేల మంది భక్తులకు అన్నదాన సదుపాయాలు కల్పనకు సర్వం సిద్ధం చేశారు. విశేష ఘట్టాలకు సీఎం ఏ రేవంత్‌రెడ్డి ఉత్సవాలకు హాజరుకావొచ్చని సంకేతాలు ఉండగా దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ వస్తున్నట్లు సమాచారం. వార్షిక బ్రహ్మోత్సవాలకు ప్రముఖులు వస్తున్నందున మూడు రోజుల పాటు 300మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్‌కుమార్ తెలిపారు.

ఆకట్టుకున్న సంగీత సభలు

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధార్మిక, సాహిత్య, సంగీత సభలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ శాస్త్రీయ సంగీత, తితిదే ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు గురువారం యాదగిరికొండపై ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు భక్తులను అలరించాయి. ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు ఏ.కే. శ్రీనివాసాచార్యులు (హైదరాబాద్) భగవత్ భక్తులు, రక్షించిన విధానంపై ఉపన్యాసం, 10 నుంచి 11.30 గంటల వరకు ముదపాక బాలసుందరం(తాడేపల్లిగూడెం) విరాటపర్వం హరికథ గానం, 11.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు స్వరణ డాన్స్(హైదరాబాద్) అకాడమీ బృందం భరతనాట్యం, 12.15 నుంచి ఒంటి గంట వరకు వింజమూరి లక్ష్మీ బృందం(మహతి ఆర్ట్స్, హైదరాబాద్), దుర్గాబాయ్ దేశ్‌ముఖ్(హైదరాబాద్) ఫైన్ ఆర్ట్స్ బృందం భక్తిసంగీతం కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



స్వామి వారి సేవకు ముందు మహిళల కోలాటం



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థలో జాబ్ మేళా

భూదాన్‌పోచంపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామి రామానందతీర్థ గ్రామీణసంస్థలో 'బ్లూ ఓసియన్' సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి తెలిపారు. గురువారం ఆమె సంస్థ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి చదివిన స్త్రీ, పురుషులకు హైదరాబాద్(ఆదిభట్ల, కొంగరకలాన్)లోని ప్రముఖ మొబైల్ కంపెనీల్లో, పురుషులకు తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ప్రముఖ ఏసీ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. వేతనం రూ.14,500 నుంచి రూ.16,500 వరకు, రొటేషన్ షిఫ్ట్, ఉచిత బస్సు, భోజన సదుపాయం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందని ఆమె తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 7న ఉదయం సంస్థ ఆవరణలో జరిగే జాబ్‌మేళాకు తమ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని కోరారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్ఠతకు సహకరించాలి

హుజూర్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో గురువారం రేషన్ దుకాణాలపై రాష్ట్ర సివిల్‌సప్లయ్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలోని మటన్‌మార్కెట్ సెంటర్, శ్రీనగర్‌కాలనీలోని రెండు రేషన్ దుకాణాలతో పాటు మండలంలోని గోపాలపురం, బూరుగడ్డ రేషన్‌దుకాణాలు, అదేవిధంగా గరిడేపల్లి మండలంలో రెండు దుకాణాలు, మేళ్లచెర్వు మండలంలో మూడు రేషన్ దుకాణాల్లో తనిఖీ చేపట్టారు. బియ్యం పంపిణీకి సంబంధించి పలు సలహాలు, సూచనలు అందించారు. రేషన్ దుకాణాలు శుభ్రంగా ఉండాలని, బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విజిలెన్స్ అధికారులతో పాటు సివిల్ సప్లయ్ ఆర్ఐ ప్రమోద్, డీలర్లు రాగం లింగయ్య, మట్టయ్య, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



బూరుగడ్డలో రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ విజిలెన్స్ అధికారులు

భువనగిరిలో పట్టపగలు రెండిళ్లలో చోరీ

భువనగిరి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో గురువారం మధ్యాహ్నం పట్టపగలు ఇద్దరు అన్నదమ్ముల ఇళ్లలో చోరీలు జరిగాయి. పట్టణ ఇన్‌స్పెక్టర్ కే సురేష్‌కుమార్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక సీతానగర్‌లో కలకొండ రాము, కలకొండ రాజు సోదరులు ఒకే ప్రహరీలోని రెండు వేర్వేరు ఇళ్లలో ఉంటున్నారు. ఈ మేరకు బుధవారం యథావిధిగా ఇరువురు ఉద్యోగాలకు వెళ్లగా వారి కుటుంబసభ్యులు పనుల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం వచ్చే సరికి రెండు ఇళ్ల తలుపులు విరగ్గొట్టి ఉన్నాయి. రెండిళ్లలో కలిపి కిలోన్నర వెండి ఆభరణాలు, రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. సంఘటనా స్థలాన్ని సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐలు క్లూస్ టీం సందర్శించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఆవుల విక్రయం

● రూ.1.05లక్షలకే మూడు ఆవులంటూ వాట్సాప్‌కు పోస్ట్ ● నమ్మి రూ.85,300 పోగొట్టుకున్న పాడి రైతు

భువనగిరి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రోజుకో రకంలో ఆన్‌లైన్ మోసాలు వెలుగుచూస్తున్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లాలో రూ.1.05లక్షలకే మూడు ఆవులంటూ వాట్సాప్‌కు ఫొటోలు పంపి పాడిరైతును నమ్మించారు. వారి మాటలతో రైతు రూ.85,300 మోసపోయాడు.ఈ సంఘటన ముత్తిరెడ్డిగూడెంలో జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో వీ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పాడిరైతుకు వాట్సాప్ ద్వారా గుర్తుతెలియని నెంబర్ నుంచి బుధవారం పలు పాడి ఆవులకు సంబంధించి ఫొటోలు వచ్చాయి. అనంతరం అదే రైతుకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తక్కువ ధరకు పాడి ఆవులను ఎంపిక చేసుకోవాలని సూచించాడు. బాధిత పాడి రైతు వాట్సప్‌లో ఉన్న మూడు పాడి ఆవులను ఎంపిక చేసుకున్నాడు. ఎంపిక చేసుకున్న మూడు పాడిఆవులకు రూ.1.05 లక్షలు అవుతాయని, ఆ డబ్బులను ఫోన్ పే ద్వారా పంపించాలన్నారు. బాధిత రైతు గుర్తుతెలియని వ్యక్తి చెప్పిన నెంబరుకు ఫోన్‌పే ద్వారా రూ.85,300లు పంపించాడు. మిగతా డబ్బులను సైతం పంపిస్తేనే పాడి ఆవులను పంపిస్తామని చెప్పడంతో బాధిత రైతు అనుమానించి మోసపోయినట్టు గుర్తించాడు. గురువారం డయల్-1930 టోల్ ఫ్రీనెంబర్‌కు ఫోన్ చేసి పాడి రైతు ఫిర్యాదుచేశాడు. ఈ మేరకు భువనగిరిరూరల్ ఎస్‌హెచ్‌వో సంతోష్‌కుమార్ ఐటీ యాక్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా కొత్త నెంబర్ల నుంచి మోసాలకు పాల్పడుతున్నట్లు గమనిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

రోడ్డు వెంట మంటలు..

భువనగిరి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి వెంట ప్రభుత్వ ఐటీఐకి ఎదురుగా నిరుపయోగంగా ఉన్న భూముల్లో అగ్ని రాజుకుంది. పెరిగిన మొక్కలు, ఎండు గడ్డి అగ్నికి ఆహుతిఅయ్యాయి. ఆకస్మాత్తుగా వెలువడిన మంటలను చూసిన పలువురు ఆందోళనకు గురయ్యారు. ఎండిన మొక్కలన్నీ కాలిపోయాక మంటలు ఆరిపోయాయి. మంటలతో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



రహదారిని కమ్మేసిన పొగలు

సంరక్షకుడే భక్షకుడు?

● నకిలీ పాస్‌పుస్తకాల దందాలో విలేజ్ ఫారెస్ట్ కమిటీ వ్యక్తి
● అటవీ భూమి పేరిట రూ.లక్షల్లో వసూళ్లు
● పోలీసుల విచారణ ముమ్మరం
● పుస్తకాలు ముద్రణ, డిజిటల్ సంతకాల ఫోర్జరీలపై ఆరా

కంచె చేను మేసిందన్న సామెతలా అడవిని రక్షించాల్సి వ్యక్తే డబ్బుల కోసం అటవీ భూములకు నకిలీ పట్టాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఏర్పాటుచేసిన విలేజ్ ఫారెస్ట్ కమిటీలు(వనసంరక్షణ సమితి)లో ఈయన కీలకంగా పని చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి భూముల సర్వే నెంబర్లు తెలిసినవాడు కావడంతో ఆ భూములన్నీ తమవేనని నమ్మించి నాలుగేళ్లుగా అనేకమంది వద్ద లక్షల్లో డబ్బులు దండుకున్నట్లు అనుమానిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని ఓ మారుమూల తండాకు చెందిన ఓ వ్యక్తి అక్కడే ఉంటూ చిన్న చిన్న పైరవీలు చేస్తూ అనేకమంది వద్ద ఆర్థిక అక్రమాలకు పాల్పడి మిర్యాలగూడ పరిసర ప్రాంతాలకు మకాం మార్చినట్లు సమాచారం. అతడు మిర్యాలగూడలో ఓ మెడికల్ దుకాణ నిర్వాహకుడికి 20 ఎకరాలకు పట్టా చేయిస్తానని 2022 నుంచి నగదు రూపేణా, ఫోన్ పే ద్వారా రూ.4 లక్షల వరకు తీసుకున్నాడు. 2022 మే నుంచి చెల్లింపులు జరిగినట్లు ఆధారాలు పోలీసుకు చిక్కాయి. తిరుమలగిరి(సాగర్) మండలం నేతాపూర్ గ్రామానికి సంబంధించిన 62/ఇ4 సర్వేనెం.లో 16.2ఎకరాల భూమికి పాస్ బుక్ 25.04.2018న, 62/అ/3 సర్వే నెంబరులో 5.32 ఎకరాలకు 21.05.2018న పాస్‌బుక్‌ను మంజూరు చేసినట్లు, అనువంశికంగా ఆ భూమిని పొందినట్లు చూపించిన పట్టా పాస్‌బక్‌లు కూడా నకిలీవని తేలాయి. బాధితుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కీలక వ్యక్తి అందించిన నకిలీ పట్టాపాస్‌పుస్తకాలు

దర్యాప్తు చేస్తున్నాం, నిందితులను పట్టుకుంటాం

డబ్బులు ఇచ్చి మోసపోయిన బాధితుడు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నాం. తడకమళ్లకు చెందిన షోయబ్‌కు 4.27 గుంటల భూమి ఇప్పిస్తానని చెప్పి ప్రసాద్‌నాయక్ అనే వ్యక్తి ఎకరాకు రూ.3.50 లక్షలకు ఒప్పందం చేసుకుని రిజిస్ట్రేషన్ ఖర్చుల కోసం రూ.35 వేలు తీసుకున్నాడు. వాట్సాప్‌లో పంపిన పాస్‌బుక్ పేజీలోని సర్వే నెంబర్లను ఆన్‌లైన్‌లో చెక్ చేసుకుని పాస్‌బుక్ నకిలీదని గుర్తించి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. చాలాకాలంగా ఈ దందా నడుస్తున్నట్లు ప్రాథమిక సమాచారం ఉంది. ఇంకా బాధితులు పెరిగే అవకాశం ఉంది. దర్యాప్తునకు రెండు బృందాలను ఏర్పాటు చేశాం. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం.

రాజశేఖర్‌రాజు, డీఎస్పీ

● మీ సేవా నిర్వాహకుల సహకారం?

నకిలీ పాస్‌బక్‌లు ముద్రించి, వాటిలో డేటా ఎంట్రీ చేసి డిజిటల్ సంతకాలను ఫోర్జరీ చేసి ఇచ్చిన పట్టాపాస్‌పుస్తకాలపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నకిలీ పట్టాపాస్ పుస్తకాల వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తి మీ సేవా సెంటర్ నిర్వాహకుల సహకారం తీసుకున్నాడా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎక్కడ పుస్తకాలు ముద్రించారు? అతడి వెనుక ఎవరెవరు ఉన్నారనే విషయమై తిరుమలగిరి(సాగర్), మిర్యాలగూడ రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా పట్టా పాస్‌పుస్తకాలు ఇచ్చిన వ్యక్తి మిర్యాలగూడలోని ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నప్పటికీ ఇల్లు ఎక్కడో తెలియదని చెప్పినట్లు సమాచారం. సదరు వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో అతడిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దిగినట్లు తెలిసింది.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆరురోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లిన యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన గంధం అరుణ్‌కుమార్(26) దామరచర్ల మండలం కేంద్రంలోని నాగకృష్ణ ఆయిల్ ఫిల్లింగ్‌స్టేషన్‌లో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 1న విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన అరుణ్‌కుమార్ తల్లిదండ్రులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు ఆరాతీస్తున్న క్రమంలో రైల్వేస్టేషన్ పరిసరాల్లో చెట్టుకు ఉరివేసుకున్నాడు. గుర్తుతెలియని యువకుడి మృతదేహంగా రైల్వేసిబ్బంది, ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి ఆచూకీ కనుగొనేందుకు రూరల్ పోలీసులు ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్టుచేశారు. ఈ క్రమంలో అరుణ్‌కుమార్ దామరచర్ల మండలం వాడపల్లి చెందిన గంధం సైదులు కుమారుడిగా స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. తండ్రి సైదులు మృతదేహం తన కుమారుడిగా నిర్ధారించారు. అరుణ్‌కుమార్ సోదరుడు వెంకయ్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో తలెత్తిన ఆర్థిక ఇబ్బందులను తాళలేక అరుణ్‌కుమార్ ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అరుణ్‌కుమార్ సెల్‌ఫోన్ స్వాధీనపర్చుకొని ఆ కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు రూరల్ ఎస్ఐ లోకేష్‌కుమార్ తెలిపారు.

మృతదేహంతో బంధువుల ఆందోళన

దామరచర్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన గంధం అరుణ్‌కుమార్ మిర్యాలగూడలో ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో గురువారం అతడి కుటుంబసభ్యులు మండలకేంద్రంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై ఆందోళనకు దిగారు. స్థానిక పెట్రోల్ బంక్ యాజమాన్యం తమ కుమారుడిని ఇబ్బందులకు గురిచేయడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించారు. పోలీసులు తక్షణమే తమకు న్యాయం చేయాలని కోరారు. అక్కడికి చేరుకున్న పోలీసులు నచ్చజెప్పి ఆందోళనను విరమింపచేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దిరాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సూర్యాపేట జిల్లా మద్దిరాల ఎస్ఐ వీరన్న తెలిపారు. గురువారం మామిళ్లమడవ గ్రామానికి చెందిన షేక్ మదార్ ఇంటి రేషన్ బియ్యం నిల్వ చేశాడన్న సమాచారంతో తనిఖీ నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, మదార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఐదు ట్రాక్టర్లపై కేసు నమోదు

ఆత్మకూరు(ఎస్), మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాచేస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మక్తాకొత్తగూడెం గ్రామానికి చెందిన బోయిని గణేష్, గుండాల గణేష్, గుండాల రాకేష్, తాళ్లసింగారం గ్రామానికి చెందిన జటంగి సౌనయ్యకు చెందిన ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బీబీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బీబీనగర్-బ్రాహ్మణపల్లి మార్గంలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సీఐ ప్రభాకర్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పెరుమాండ్ల సూర్యప్రసాద్(24) బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై బీబీనగర్ నుంచి స్వగ్రామం బ్రాహ్మణపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో హిందుస్థాన్ గోదాం సమీపంలో మూలమలుపు వద్ద ఎదురెదురుగా కారు, బైకు వేగంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో సూర్యప్రసాద్ తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సూర్యప్రసాద్ సోదరుడు పెరుమాండ్ల భానుచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సూర్యప్రసాద్ (ఫైల్‌ఫొటో)

ఆత్మహత్య కేసులో నిందితుల రిమాండ్

మాడ్గులపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మండలంలోని ఆగామోత్కూరు గ్రామానికి చెందిన నక్క చంద్రయ్య రెండవ కుమారుడు నక్క వెంకన్న(35)కు సరితతో 14ఏళ్ల కిందట వివాహమైంది. కొన్నాళ్లు సజావుగా సాగుతున్న కాపురంలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. వీరికి పాప, బాబు ఉన్నారు. భార్య సరితను కాపురానికి రావాలని వెంకన్న పలుసార్లు మాట్లాడినా రాకపోవడంతో పాటు కుక్కడం గ్రామానికి చెందిన ఊరుబిండు మల్లయ్యతో వివాహేతరసంబంధం పెట్టుకుని వెంకన్నను ఇబ్బందులకు గురిచేసింది. అదేవిధంగా సరిత మేనమామ మన్నెం శ్రీను ఆమెకు సహకరించడంతో మనస్తాపానికి గురైన వెంకన్న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సరిత, మేనమామ మన్నెం శ్రీను, ఊరుబిండు మల్లయ్యలు తన మృతికి కారమణని సూసైడ్ నోట్‌లో రాసి గత నెల 22న బాత్‌రూమ్‌లో ఉరివేసుకున్నాడు. వెంకన్న తండ్రి చంద్రయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గురువారం ముగ్గురిని అరెస్ట్ చేసి మిర్యాలగూడ కోర్టులో హాజరుపరచగా పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులకు 14రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

కిడ్నాప్ కథ సుఖాంతం

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మూడు రోజుల క్రితం కిడ్నాప్ గురైన మూడేళ్ల బాలుడి కథ సుఖాంతమైంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ పట్టణంలోని లయన్‌వాడకు మహ్మద్ హైమద్, షమీమ్ మున్నీసా దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరు కొన్నాళ్లుగా ఆస్పత్రి ప్రాంగణంలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఐదేళ్ల బాలికతో పాటు మూడేళ్ల అబ్దుల్ రెహమాన్ ఉన్నారు. ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమీపంలో బాలుడు ఆస్పత్రి ఆవరణలో ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి బాలుడిని ఎత్తుకెళ్లాడు. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన తల్లి ఆస్పత్రి ప్రాంగణం అంతా వెతికింది. అయినా ఆచూకీ లభించకపోవడంతో టూటౌన్ పోలీసులకు అదే రోజు రాత్రి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆసుపత్రి ప్రాంగణం, బస్టాండ్ పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి బాలుడిని ఎత్తుకెళ్లిన దృశ్యాలను గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి టూటౌన్ ఎస్ఐ నాగరాజు దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు ఆరు బృందాలు గాలించి బాలుడిని ఎట్టకేలకు గుర్తించినట్లు సమాచారం. టెక్నికల్ టీంతో పాటు స్థానికుల సమాచారం మేరకు కేసు ఛేదించి కిడ్నాపర్‌ను పట్టుకున్నారు. బాలుడిని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ సాగిస్తున్నారు. నకిరేకల్ చెందిన వ్యక్తికి బాలుడిని విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా నల్లగొండ పట్టణంలోని గొల్లగూడ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.



బాలుడిని ఎత్తుకెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి



ఆందోళనలో బాలుడి తల్లిదండ్రులు

అన్నం పరబ్రహ్మ స్వరూపం

అన్నం పరబ్రహ్మం స్వరూపం. అన్నిదానాల కంటే అన్నం దానం చేయడం ముక్తిప్రదాయకమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఎంతటి సిరిసంపదలు కలిగిన సంపన్నులైనా... భగవంతుడి సన్నిధిలో అన్నప్రసాదం స్వీకరణ పుణ్యఫలమని నమ్మకం. అందుకే ప్రతీ ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేయడం సంప్రదాయంగా మారింది.

• నాలుగు దశాబ్దాలుగా భక్తులకు అన్నప్రసాద వితరణ రూ.20కోట్లతో ఆధునిక అన్నసత్రం



గండిచెరువు సమీపంలో దీక్షాపరుల మండపంలో అన్నప్రసాద భవనం

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

యాదగిరిగుట్ట ఆలయ సన్నిధిలో పూర్వం నుంచి భక్తులకు అన్నప్రసాద సదుపాయం కల్పించినప్పటికీ.. సుమారు నాలుగు దశాబ్దాలుగా దాతల విరాళాలతో అన్నప్రసాదం అందుబాటులోకి తెచ్చి ప్రత్యేక సత్రం నిర్మించి భక్తులకు స్వామివారి అన్నప్రసాదం నిరంతరం కొనసాగిస్తున్నారు.

1987 నుంచి అన్నదానం ప్రారంభం

యాదగిరిగుట్ట ఆలయ సన్నిధిలో పూర్వకాలం నుంచి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్న సదుపాయం కల్పించేవారు. అప్పట్లో దేవస్థానం ఆధ్వర్యంలోని రామానుజ కూటం, బ్రాహ్మణ సత్రంలో భోజన సదుపాయం అందుబాటులో ఉండేది. దేవస్థానం నిధులతో రామానుజ కూటంలో దేవుడి సన్నిధిలో పూజా విధులు నిర్వహించే అర్చకులకు, బ్రాహ్మణ సత్రంలో స్వామిని దర్శించుకునే బ్రాహ్మణులు, ఇతర ప్రముఖులకు అన్నపానీయాల సదుపాయం సమకూర్చేవారు. బ్రహ్మోత్సవాలు, ఇతర విశేష వేడుకల్లో మాత్రం కొండపై గల శ్రీరామ్ భవన్‌లో భక్తులకు భోజన సదుపాయం కల్పించేవారు. కాలక్రమేణ భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అన్నప్రసాదానికి ఆదరణ కూడా అదే స్థాయిలో అధికమవడంతో 1987 సంవత్సరంలో శాశ్వత అన్నదాన పథకానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ఆలయ ఈవో బి. సుబ్బారావు ఆధ్వర్యంలో అన్నదాన పథకం ప్రవేశపెట్టి భక్తుల నుంచి విరాళాల సేకరణ ప్రారంభించారు. అన్నదానం కోసం రూ.516 నుంచి ఆపైన విరాళాలు అందజేసిన భక్తుల గోత్రనామాలపై అర్చనలు చేసి స్వామివారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. తొలుత కొండపై రోజుకు 200 మంది, ఆ తర్వాత 500మంది, ప్రతి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాలు, విశేష రోజుల్లో 1000 నుంచి 1500 మంది వరకు భోజన సదుపాయం కల్పించారు. బ్రహ్మోత్సవాల వేళ రెండు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నట్లు ప్రస్తుత ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. ఇప్పుడు జన్మదినం, వివాహ వార్షికోత్సవం వంటి శుభ కార్యక్రమాల సందర్భంగా అన్నదాన పథకంలో చేరిన భక్తుల గోత్రనామార్చనలు నిర్వహించే విధంగా మార్పులు చేశారు.


అన్నదాన పథకానికి నిధి రూ. 25.37 కోట్లు

నృసింహ క్షేత్రంలో భక్తుల విరాళాలతో ప్రారంభించిన అన్నదాన పథకానికి అనతి కాలంలోనే విశేష ఆదరణ లభించింది. కొండపై స్వామివారి అన్నప్రసాదం స్వీకరించడమే కాక ఇతర భక్తులకు అన్నసదుపాయం కల్పించేందుకు భారీగా విరాళాలు అందజేస్తున్నారు. అందులో భాగంగానే అన్నదానం కోసం భక్తుల నుంచి వచ్చిన విరాళాలు రూ. 25.37 కోట్లు సమకూరాయి. ఈ నిధిని బ్యాంకులో డిపాజిట్ చేయగా వచ్చిన వడ్డీతో భక్తులకు అన్నప్రసాద వితరణ అందిస్తున్నారు.


రూ. 20 కోట్లతో ఆధునిక అన్నసత్రం

హరేరామ.. హరే కృష్ణ, ఇస్కాన్ వంటి ఆధ్యాత్మిక సంస్థలతో సంప్రదింపులు జరిపిన ప్రకారం కొండ కింద ప్రత్యేక ప్రణాళికలతో గండిచెరువు సమీపంలో వైటీడీఏ డిజైన్ రూపొందించగా ఆరు ఎకరాల్లో సుమారు రూ.20కోట్లతో ఆధునిక అన్నప్రసాద భవనం సిద్ధంచేశారు. కాగా, దాత విరాళం రూ. 14కోట్లు, మిగత పనులు కావాల్సిన నగదు వైటీడీఏ (భవనం పునాదులు), దేవస్థానం (గ్యాస్‌స్టౌవ్, పైపులైన్, బ్యాలర్లు) భాగస్వామ్యంతో నిరంతర అన్నదానం అందించేందుకు భవన నిర్మాణం పూర్తిచేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వంట పరికరాలు, పాత్రలు శుభ్రం చేసే యంత్రాల సేకరణ మిగిలింది. ముందుగా ప్రస్తుత వార్షిక బ్రహ్మోత్సవాలకే ప్రారంభించాలని అనుకున్నప్పటికీ అది స్వామివారి జయంతి ఉత్సవాలకు వాయిదా పడినట్లు తెలుస్తోంది.

నాడు



నేడు



నాడు



నేడు



నాడు



నేడు



యాదగిరిగుట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కీంకారణ్యం నుంచి బంగారు వర్ణం విద్యుత్‌దీపాలతో జిగేలుమనే స్వర్ణ కాంతుల వరకు యాదగిరిగుట్ట ఆలయం ఆవిష్కృతమైంది. దినాదినాభివృద్ధి చెందుతూ రాష్ట్రం సిద్ధించాక సుమారు రూ.1,200కోట్లతో నిర్మించిన అద్భుత శిల్పకళా సంపదతో కృష్ణ శిలల రాతి ఆలయంగా రూపాంతరం చెందింది. శతాబ్దాల క్రితమే కీంకారణ్యంలో స్వయంభువు ఆలయం ఉన్నప్పుడే ఇక్కడ నిత్యపూజలు జరిగేవి. భక్తులు బృందాలుగా చేరి డప్పు చప్పులు, జయధ్వానాలు చేస్తూ కాగడాల వెలుగుల మధ్య ఊరేగింపుగా కొండపైకి వెళ్లి స్వామి వారికి పూజాది కైంకర్యాలు, నైవేద్యాలు సమర్పించేవారు. ఒక పాలకమండలి లేని లోటు మినహా స్వామికి నిత్యారాధనలు, కైంకర్యాలకు ఎలాంటి కొదవలేదు. కోడి కూత కంటే ముందే ఆలయంలో నిత్యం వేద మంత్ర పఠనాలు, మంగళవాద్యాలతోనే ఇక్కడ తెల్లారుతోంది. అసలు ఈ ప్రాంతంలో జన్మించడమే ఎన్నో జన్మల పుణ్యఫలంగా భక్తులు భావిస్తుంటారు. కాగా, ఆలయ పునర్నిర్మాణంలో భాగంగాక్షేత్రానికి ఉత్తర దిక్కులోని (యాదగిరిపల్లి) ఉంగరాళ్లగుట్ట ప్రెసిడెన్షియల్ సూట్స్‌ల్లో అతిథులకు ఆతిథ్యం అందుతోంది. అదేవిధంగా ఒకప్పటి ఆలయపాత, కొత్త తూర్పు రాజగోపురాలు, కొండపైన స్వాగత తోరణాలు దేనికి అదే ప్రత్యేకతను సంతరించుకున్నవి కావడం విశేషం.

సహకార బ్యాంకుల్లో

రూ.2వేల కోట్ల రుణ పంపిణీ

• డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సహకార బ్యాంకుల ద్వారా ఇప్పటి వరకు 2వేల కోట్ల రుణ పంపిణీ చేశామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ బ్యాంకులో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు రుణాలను రూ.580కోట్లు, పంట రుణాలు రూ.571కోట్లు, మార్టిగేజ్ లోన్లు రూ.405కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.379కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. మొత్తంగా బ్యాంకు వ్యాపారం రూ.3వేల కోట్లకు చేరువలో ఉందని, అదేవిధంగా ఈ సంవత్సరం రూ.50కోట్ల లాభాలకు చేరుకుంటుదని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం అనేక ముఖ్య నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహరుణాలు సులభతరంగా ఇస్తామని, పౌల్ట్రీ రుణాల చెల్లింపు కాలపరిమితి పెంచుతామన్నారు. ఎన్ఎల్ఎం స్కీం కింద అదనపు రుణాలను చేర్చడం కోసం నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో శంకర్‌రావుతో పాటు పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

• వైభవంగా కనుముకుల వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేద పండితులు, హాజరైన సినీనటి అంజలి, ఆలయ నిర్మాణకర్తలు



సినీనటి అంజలిని సన్మానిస్తున్న ఆలయ నిర్మాతలు కోట మల్లారెడ్డి-పుష్పలత

భూదాన్‌పోచంపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కనుముకుల పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి వారి 22వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి తిరుకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల మధ్య మంగళ వాయిద్యాలతో వేలాది మంది భక్తులు హాజరు కాగా స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయంలో హోమం, బలిహరణం, శ్రీసూక్తహవనం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామివారి తిరుకల్యాణోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు బంగారు మంగళ సూత్రాలు, ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఆలయ ధర్మకర్తలు కోట మల్లారెడ్డి - పుష్పలత, గొట్టం వెంకట్‌రామ్‌రెడ్డి - బాంధవిరెడ్డి, కోట అభిలాష్‌రెడ్డి-శ్రీజరెడ్డి సమర్పించారు. ఉత్సవాల్లో ప్రముఖ సినీనటి కుమారి అంజలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆమె ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలకు హాజరైన సినీనటి కుమారి అంజలిని ఆలయ ధర్మకర్తలు కోట మల్లారెడ్డి-పుష్పలత జ్ఞాపికతో సన్మానించారు. అనంతరం భక్తులకు మహాన్నదానం నిర్వహించారు. ఉత్సవాల్లో కోట అంజిరెడ్డి, సామల మల్లారెడ్డి, దారెడ్డి జంగారెడ్డి, కోట రామచంద్రారెడ్డి, చిన్నకోట క్రిష్టారెడ్డి, బోయపల్లి శశిధర్‌రెడ్డి, వాకిటి రామచంద్రారెడ్డి, వాకిటి రామచంద్రారెడ్డి, గౌరవ సలహాదారులు బోగ చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాక నర్సింహయాదవ్, కోట అంజిరెడ్డి, గట్టు పాండురంగారెడ్డి, రంగ మధు, నూకల లింగస్వామి యాదవ్, కోట భూపాల్‌రెడ్డి, మట్టిపల్లి ఐలయ్య యాదవ్, వేణుగోపాలచారి, మంచాల నవీన్, నెలికంటి లింగస్వామియాదవ్ పాల్గొన్నారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, రథోత్సవం, హోమం, బలిహరణం నిర్వహించారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిథ్యం కల్పించాలి

• ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్



సంతకాలు సేకరిస్తున్న ఉపేందర్

రామన్నపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న గ్రామ, మునిసిపాలిటీ, మండల, జిల్లా పరిషత్‌లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేయడానికి వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. గురువారం రామన్నపేట మండలం వెల్లంకి గ్రామ పరిధి అంబాయిగూడెంలో దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రానిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోఎన్‌పీఆర్‌డీ మండల కార్యదర్శి గిరికల లింగస్వామి, అధ్యక్షులు పల్లం పరుశురాం, కార్యదర్శి ఎండీ బాకర్, ఉపాధ్యక్షులు జినకల లావణ్య, సహాయ కార్యదర్శి మోటే రాజు, కోశాధికారి వనం విజయలక్ష్మీ తదితరులు ఉన్నారు.

పోలీస్ సేవలు మరింత చేరువగా

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ ఒక్కటే సూర్యాపేట పట్టణంలో ఉంది. 2012లో సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్ స్థాయిని పెంచి ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా చేశారు. కాగా, ఇటీవల నేరాల సంఖ్య పెరిగింది. సూర్యాపేట జిల్లాగా ఏర్పడ్డాక టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎస్పీలు నివేదికలు పంపించారు. అయితే ఎస్ఐ ఎస్‌హెచ్‌వోగా టూటౌన్ స్టేషన్ ఏర్పాటైంది. దీంతో సిబ్బంది మంజూరు సంఖ్య తక్కువగా ఉంది. ప్రస్తుతం ఉన్న పట్టణ స్టేషన్‌లోనే టూటౌన్ స్టేషన్ కూడా కొనసాగుతోంది. దీంతో టూటౌన్ స్టేషన్‌ను ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా అప్‌గ్రేడ్ చేయాలని ఇటీవల ప్రభుత్వానికి ఎస్పీ నివేదిక పంపించారు.

టూటౌన్ ఏర్పాటైయితే సిబ్బంది సంఖ్య పెరగడంతో పాటు స్టేషన్‌కు కూడా వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నారు. దీంతో పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ పోలీసులకు సులువు కానుంది. ప్రస్తుతం కొనసాగుతున్న మండల, పట్టణ పోలీస్‌స్టేషన్లలో కొన్నేళ్ల క్రితం మంజూరైన పోలీస్ సిబ్బంది సంఖ్యనే కొనసాగుతోంది. మండల పోలీస్‌స్టేషన్లలో 25 మంది వరకు మాత్రమే సిబ్బంది ఉంటున్నారు. దీంతో పెరిగిన జనాభా, జరుగుతున్న నేరాలను అరికట్టడం ఇబ్బందిగా మారింది. అందుకోసం ప్రతీ పోలీస్ స్టేషన్‌కు గతంలో మంజూరైన సిబ్బంది సంఖ్యను పెంచే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

మరింత వేగవంతమైన సేవలందించేందుకు చర్యలు

జిల్లాలో ప్రజలకు మరింత వేగవంతమైన పోలీస్ సేవలందించేందుకు చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగా జనాభా ఎక్కువగా ఉన్న, నేరాల సంఖ్య ఎక్కువగా నమోదవుతున్న పోలీస్ స్టేషన్లలో సిబ్బంది సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వానికి నివేదించాం. దీంతో పాటు సూర్యాపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నుండి వచ్చే ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకుంటాం. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు రాజీ లేకుండా విధులు నిర్వహిస్తున్నారు.

• సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ సూర్యాపేట

మహిళా పోలీస్‌స్టేషన్

సూర్యాపేట జిల్లాగా ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం భావించింది. అందుకోసం అప్పుడు పని చేసిన జిల్లా ఎస్పీలు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కానీ, నేటి వరకు మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాలేదు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లకు ఎక్కువగా వస్తున్న ఫిర్యాదుల్లో మహిళలకు సంబంధించినవే ఉంటున్నాయి. ప్రత్యేకంగా మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ఈ ఫిర్యాదులను అక్కడ పరిష్కరించే అవకాశం ఉంటుంది. దీంతో మండల, పట్టణ పోలీస్‌స్టేషన్లలో ఇతర విధులపై దృష్టి సారించే అవకాశం ఉండనుంది.

పత్తాలేని హైవే పోలీస్‌స్టేషన్లు

జాతీయ రహదారులపై నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. అదే స్థాయిలో రోడ్డు ప్రమాదాలు కూడా ఉంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు శాంతిభద్రతల విభాగం పోలీసులే కేసులు నమోదు చేయడంతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. ఇలాంటి సమయాల్లో శాంతిభద్రతల విషయంలో ఇబ్బందులు కలుగుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో జాతీయ రహదారులపై హైవే పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేసి ఆ స్టేషన్లకు ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందిని నియామకం చేయాలని భావించింది. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జాతీయ రహదారి-65పై చౌటుప్పల్, మునగాల వద్ద హైవే పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే ఇది నేటికీ కార్యరూపం దాల్చలేదు.

పోలీస్‌స్టేషన్ల స్థాయి పెంపుతో పదోన్నతులు

రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్ల స్థాయిని పెంచడం, నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుతోపాటు పోలీసులకు పదోన్నతులు కల్పించనున్నారు. స్టేషన్ల స్థాయిని పెంచినప్పుడు ప్రతీ స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలి. దీంతో పదోన్నతలు కల్పించనున్నారు. ప్రస్తుతం 2012 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐల్లో కొందరికి సుమారు రెండేళ్ల క్రితం సీఐలుగా పదోన్నతులు వచ్చాయి. ప్రస్తుతానికి సీఐ పోస్టులు ఖాళీగా లేకపోవడంతో చాలా మంది 2012 బ్యాచ్ ఎస్ఐలు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. స్టేషన్ల స్థాయి పెరిగితే పదోన్నతులు రానున్నాయి. అదే విధంగా నూతన పోలీస్‌స్టేషన్లు ఏర్పాటైతే కొత్త పోస్టులు భర్తీ అవుతాయి. అప్పుడు కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ, సీఐ, డీఎస్పీల వరకు పదోన్నతల ప్రక్రియ వేగవంతమవుతుంది.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	526.50
టీఎంసీలు	161.3960
ఎడమకాల్వకు నీటి విడుదల	8718
కుడికాల్వకు	8023
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	280 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్ క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	18821 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.50 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	నిల్
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	633.17 అడుగులు
టీఎంసీలు	1.87
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	2.43 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	649.66 క్యూసెక్కులు

భరించలేని మోకాళ్ల

నొప్పులకు మాత్రమే శస్త్రచికిత్సలు

• డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి వెల్లడి



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సాంబశివారెడ్డి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భరించలేని మోకాళ్ల నొప్పులకు మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలే పరిష్కారమని గుంటూరుకు చెందిన సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. భారత ఆహార సంస్థ, గుంటూరు సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కమ్యూనిటీ హాల్‌లో మోకాళ్ల నొప్పులు, నివారణ, శస్త్రచికిత్సలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరంలో ఆయన ప్రసంగించారు. మోకాళ్ల నొప్పులు ఉన్న ప్రతీ ఒక్కరికి ఆపరేషన్ అవసరం లేదని, పది మందిలో ఇద్దరు, ముగ్గురుకి మాత్రమే ఆపరేషన్ అవసరం అవుతుందని డాక్టర్ నరేంద్రరెడ్డి తెలిపారు. ఆహారపు అలవాట్లు, రోజువారీ వ్యాయామంతో కీళ్లనొప్పులకు దూరంగా ఉండవచ్చని ఆయన వివరించారు. ఆస్పత్రికి చెందిన డాక్టర్ యరగూటి సాంబశివారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఎంఆర్ సాయిభాస్కర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వేలాది మందికి మోకీలు మార్పిడి ఆపరేషన్లు నిర్వహించి పూర్వ నడకను ఇవ్వగలిగినట్లు తెలిపారు. కొత్తగా సాయిభాస్కర్ హాస్పిటల్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన రోబోతో మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేస్తూ నూరు శాతం ఫలితాలు రాబడుతున్నామని తెలిపారు. ఎఫ్‌సీఐ ఉద్యోగ కుటుంబ సభ్యులకు, విశ్రాంత ఉద్యోగులకు, హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్న వారికి నగదు రహిత ఆపరేషన్లు నిర్వహిస్తామని డాక్టర్ సాంబశివారెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ సీనియర్ మేనేజర్ కేఎన్‌కే ప్రసాద్, విశ్రాంత ఉద్యోగులు లక్ష్మారెడ్డి, మాదగోని భిక్షపతి, గాంధీ, యూసుఫ్, జానీమియా, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

గోపలాయపల్లి గుట్టపై సుదర్శనహోమం

నార్కట్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణు గోపాలస్వామి దేవస్థానం గుట్టపై గురువారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ప్రతీనెలా స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణిని పురస్కరించుకుని సుదర్శన హోమాన్ని నిర్వహిస్తారు. పలువురు దంపతులు హోమగుండం వద్ద క్రతువులో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు, భక్తులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మాయికి వివాహానికి ఆర్థికసహాయం

చిట్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీ 7వ వార్డుకు చెందిన మేడే మంజులశేఖర్ కుమార్తె శ్వేత వివాహం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ కూరెళ్ల లింగస్వామి వారి వివాహానికి రూ.10,116 ఆర్థికసాయం అందజేశారు. గత మునిసిపల్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వార్డుకు చెందిన ప్రతి అమ్మాయి వివాహానికి ఆర్థికసాయం చేస్తున్నట్లు వైస్‌చైర్మన్ లింగస్వామి తెలిపారు.

అందని ఆధార్ సేవలు

- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- సాంకేతిక సమస్యగా పేర్కొంటున్న ఏజెన్సీలు

నార్కట్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఆధార్ నమోదు కేంద్రాలు పది రోజులుగా మూత పడ్డాయి. ఆధార్ సేవల కొనసాగింపులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యల కారణంగా నిర్వాహకులు కేంద్రాలను మూసివేసినట్లు తెలుస్తుంది. ఫలితంగా ఆధార్ సేవల కోసం వినియోగదారులు పక్క మండలమైన చిట్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ప్రస్తుతం రెండు ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఒకటి రెవెన్యూ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తుండగా మరొకటి బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ కార్యాలయంలో (థర్డ్ పార్టీగా) నిర్వహిస్తున్నారు. ఈ ఆధార్ కేంద్రాల్లో కొత్త ఆధార్ కార్డుల నమోదు, ఇప్పటికే ఉన్న ఆధార్ కార్డుల్లో దొర్లిన తప్పుల సవరణ వంటి సేవలు అందిస్తున్నారు. ఈ రోజుల్లో ప్రతీ పని ఆధార్‌తో ముడిపడి ఉన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈ రెండు ఆధార్ కేంద్రాలు పది రోజులుగా మూతపడటంతో సేవలందక వినియోగదారులకు సంబంధించిన పనులు వాయిదా పడుతున్నాయి. విద్యార్థులకు పరీక్షల సమయం, రైతులకు పంట రుణాలు, మాఘమాసం పెళ్లిళ్ల సీజన్ కావడం ఇలా అన్ని వర్గాల వారికి కీలక సమయం కావడంతో ఆధార్ సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో నిర్వహించే రెండు కేంద్రాల్లోనూ సాంకేతక సమస్యలు తలెత్తినట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించి సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.



నార్కట్‌పల్లిలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మూసివేసిన ఆధార్ కేంద్రం

ఆధార్ కేంద్రాలను తెరిపించాలి



పది రోజులకు పైగా మూతపడిన ఆధార్ కేంద్రాల్లో తక్షణమే సేవలందించేలా అధికారులు చొరవ చూపాలి. ఆధార్ కేంద్రాల మూసివేతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు, మార్పులు చేర్పుల కోసం ఆధార్‌కార్డులు అవసరం ఉంది. అవి అందక దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపి ఆధార్ సేవలందేలా చర్యలు తీసుకోవాలి.

● చిరుమర్తి యాదయ్య, మాజీ ఎంపీటీసీ

ఈడీఎం దృష్టికి తీసుకువెళ్లా



నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆధార్ కేంద్రాలు నిలిచిపోయిన సమస్యను జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఈడీఎం) దృష్టికి తీసుకెళ్లా. మీ సేవ కేంద్రం లాగిన్ లాక్ కావడం జరగడంతో పాటు ఆధార్ సేవలందించే పరికరాలు కూడా సాంకేతిక సమస్యతో సపోర్టు చేయడం లేదని తెలిపారు. త్వరగా ఆధార్ సేవలందేలా ప్రయత్నం చేస్తానని చెప్పారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉన్నతాధికారుల దృష్టికి మరోసారి తీసుకెళ్తా.

● వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ నార్కట్‌పల్లి

కంపచెట్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదకరంగా మారినా పట్టించుకోని అధికారులు


శాలిగౌరారం బస్‌స్టేజీ వద్ద కంపచెట్ల మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

శాలిగౌరారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా అస్తవ్యస్తంగా, అసౌకర్యంగా తయారయ్యాయి. ఫలితంగా వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ లేకుండా, కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు కంపచెట్ల మధ్యలో ఉన్నాయి. మరికొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు ఆన్ ఆఫ్ సిస్టమ్ లేకుండా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎన్నో మూగజీవాలు బలైపోతున్నా విద్యుత్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నకిరేకల్ - గురజాల ప్రధాన రహదారిలో శాలిగౌరారం బస్‌స్టేజీ సమీపంలో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా కంపచెట్ల మధ్యలో అల్లుకొని ఉంది. ఆకారం, చిత్తలూరు, పెర్కకొండారం గ్రామాలల్లో కూడా పలు ట్రాన్స్‌ఫార్మర్లు కంప చెట్ల మధ్యలో ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేయాలంటే సిబ్బంది, ఆ ప్రాంతాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంపచెట్లను తొలగించి, ఆన్‌ఆఫ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వేసవిలో ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు

వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో, నల్లగొండ



నల్లగొండ మండలంలోని గ్రామాల్లో నీటి, విద్యుత్ సమస్యలు రాకుండా ముందుస్తు చర్యలు చేపట్టాం. అదే విధంగా ఇంటి పన్నులు 80శాతం వసూళ్లు చేశాం. మార్చి 31 నాటికి నూరు శాతం ఇంటి పన్ను బకాయిలు వసూలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

(నల్లగొండ రూరల్, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి చర్యలు చేపట్టారు.

ఎంపీడీవో: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాం. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. ఇందుకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యవేక్షిస్తుంటారు.

ఆంధ్రజ్యోతి: వేసవికాలంలో విద్యుత్ సమస్య వస్తే ఎలాంటి చర్యలు చేపట్టనున్నారు.

ఎంపీడీవో: గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వెంటనే వాటి స్థానంలో మరొక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసే విధంగా విద్యుత్ అధికారులను అప్రమత్తం చేశాం.

ఆంధ్రజ్యోతి: ప్రజలు వేసవి తీవ్రత నుంచి బయటపడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు.

ఎంపీడీవో: వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించాం. ఎప్పటికప్పుడు ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు వారికి సమస్యలు వస్తే వెంటనే వైద్యం అందించేందుకు అందుబాటులో ఉంటే విధంగా చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ఇంకా ఎలాంటి చర్యలు చేపట్టారు.

ఎంపీడీవో: ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లోని ఇంటి పన్ను బకాయిలు, ఎంపీవో ఆధ్వర్యంలో నేటి వరకు 80 వసూలు చేశాం. మార్చి 31 నాటికి 100 శాతం పూర్తి చేస్తాం.

'ఉపాధి' పనులు సద్వినియోగం చేసుకోవాలి


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో మున్నయ్య

మర్రిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న 100 రోజుల కూలీ పనులను సద్వినియోగం చేసుకోవాలని మర్రిగూడ ఎంపీడీవో మున్నయ్య తెలిపారు. మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో గురువారం ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఆయన పరిశీలించయారు. కూలీలకు సంబంధించిన మస్టర్ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీలకు ఉపాధిహామీ పథకం ద్వారా రోజుకు రూ.300లు ఇస్తుందని తెలిపారు. వేసవి కాలం సమీపిస్తున్నందున ఉపాధి కూలీలు ఎండలకు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు, కార్యదర్శులకు సూచించారు. ఉపాధి కూలీలకు అడిగిన వెంటనే పనులు కల్పించాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

నాంపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన ప్రారంభమైన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తెలుగు, అరబిక్, ఉర్దూ, సంస్కృతం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ రజనీకాంత్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ జయప్రకాష్ తెలిపారు. గురువారం నాటి పరీక్షలకు 378 మంది హాజరు కావాల్సి ఉండగా 9 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు. ఈ పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీబా బృందం తనిఖీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ పరీక్షలకు సెట్- ఏ ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశారు.


నల్లగొండలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మర్రిగూడ: మండలకేంద్రంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కేజీబీవీ పాఠశాల, ఆదర్శ మోడల్ స్కూల్‌లోని రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రెండు కేంద్రాల్లో 351 మంది విద్యార్థులకు గాను 337 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు శివ స్వరూపరాణి, సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. వారి వెంట డీవో శిరీష, జ్యోతి ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- చండూరు ఆర్డీవో శ్రీదేవి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీదేవి

మర్రిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి అధికారులకు సూచించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సకాలంలో పూర్తి చేయడమే కాకుండా కార్యాలయానికి వచ్చే బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని ఆమె సూచించారు. సమావేశంలో తహసీల్దార్ బక్క శ్రీనివాస్, డీటీ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌నాయక్, ఆర్ఐ పాండురంగారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సువర్ణ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు కిసాన్ క్రెడిట్ ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వంశీ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జి.వి. రమేష్ అన్నారు. చిట్యాల ఎస్‌బీఐలో పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ ద్వారా మంజూరైన రుణాలను వారు గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లాలోనే మొట్టమొదటిసారిగా కిసాన్ క్రెడిట్ ద్వారా చిట్యాలలో రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. రుణాలను సద్వినియోగం చేసుకొని సకాలంలో చెల్లిస్తే మరోమారు రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రుణాలు కావాలనుకునే పాడి రైతులు పశు వైద్యాధికారిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ సయ్యద్‌ముస్తాక్ ఖాద్రీ, ఎస్‌బీఐ మేనేజర్ వరప్రసాద్, పాలకేంద్రం మేనేజర్ చెన్నారెడ్డి, శ్రీనివాసరావు, డాక్టర్ అభినవ్, డాక్టర్ అమరేందర్ పాల్గొన్నారు.


పాడిరైతులకు రుణాలను పంపిణీ చేస్తున్న మేనేజర్ వంశీ

చెర్వుగట్టులో ఉచిత వైద్యశిబిరం

నార్కట్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టులో గురువారం గ్రామ తాజా మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ సౌజన్యంతో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. నల్లగొండలోని గాంధీ న్యూరో ఆసుపత్రికి చెందిన వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారికి బీపీ, షుగర్‌లకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో వరిలో చీడపీడల నివారణ


కొత్తపేటలో యాసంగి వరి పంటను పరిశీలిస్తున్న కేతేపల్లి ఏవో పురుషోత్తం

కేతేపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి వరిలో చీడపీడల నివారణకు రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం సూచించారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. వరిలో వచ్చిన అగ్గి తెగులు, కాండం కుళ్లు తెగులు, కంకినల్లి తెగులును గమనించారు. ప్రస్తుతం పొట్ట, ఈత దశలో ఉన్న వరి పంటను ఆశించిన ఈ తెగుళ్ల నివారణకు ఆయన పలు సూచనలు చేశారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజైల్‌ను లీటరు నీటికి 0.6గ్రాముల చొప్పున కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. కాండం కుళ్లు నివారణకు వాలిడామైసిన్ లీటరు నీటికి 2మి.లీ. లేదా హెక్సకనాజోల్ 2మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కంకి నల్లి తెగులు నివారణకు డైకాఫోల్ లీటర్ నీటికి 5మి.లీ. లేదా ప్రొఫెనోఫోస్ 2మి.లీ.గాని, స్పైరోమెసిఫిన్ 1మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. పైసూచనలను పాటించి రైతులు పంటలను కాపాడుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈవో నాగరాజు, రైతులు సోమయ్య, నర్సయ్య, పాపయ్య తదితరులు ఉన్నారు.

కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ చేసిన నిఖిల


నిఖిల

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఓయూ కామర్స్ విభాగంలో నల్లగొండ జిల్లాకు చెందిన కందిబండ నిఖిలకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) లభించింది. హైదరాబాద్ కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో పార్ట్‌టైం అధ్యాపకురాలిగా పనిచేస్తుంది. అదే విశ్వవిద్యాలయం కామర్స్ హెడ్‌గా పనిచేస్తున్న నజీయా సుల్తానా పర్యవేక్షణలో 'పంటలు, పశువుల బీమాకు సంబంధించి ఎంపిక చేసిన బీమాల కంపెనీల మార్కెటింగ్‌పై, రైతుల దృక్పథం' అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

వల్లాలలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు


వల్లాలలో అగ్నిగుండాల వద్ద దేవతా మూర్తుల, ప్రబల ఊరేగింపు

శాలిగౌరారం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని పార్వతీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో వారం రోజుల పాటు జరిగిన నవరాత్రి ఉత్సవాలు గురువారం ఏకాంత సేవల కార్యక్రమంతో ముగిశాయి. బుధవారం రాత్రిస్వామి వారి ఆంజనేయ ప్రభల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. గురువారం తెల్లవారుజామున నాగవెళ్లి, అగ్నిగుండాల కార్యక్రమం భక్త జనసముహం మధ్య నిర్వహించారు. భక్తుల నిప్పుల మంటలో నడిచి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. గురువారం రాత్రి ఏకాంత సేవలు కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ పురోహితులు వావిలాల వేణునాథశర్మ, వావిలాల రామలింగయ్యశర్మ, వావిలాల ఫణికుమార్‌శర్మ, దాతలు పాల్గొన్నారు.

దివ్యాంగ మిత్రుడికి త్రిచక్ర వాహన బహుమతి


సైదులుకు త్రిచక్ర వాహనాన్ని అందజేస్తున్న స్నేహితులు

శాలిగౌరారం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం వల్లాల జడ్పీ హైస్కూల్‌లో 1994-95 బ్యాచ్‌కు చెందిన కంచుగట్ల సైదులు అనే దివ్యాంగునికి అతనితో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలిసి త్రిచక్రవాహనాన్ని బహుమతిగా అందజేశారు. అందజేసిన వారిలో గోదల వెంకట్‌రెడ్డి, కట్టగూరి శ్రీనివాస్‌గౌడ్, జాల శంభయ్య, కొల్లు సత్తిరెడ్డి, గోనే యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వల్లాల గ్రామ పురోహితులు వావిలాల రామలింగయ్య శర్మ త్రిచక్ర వాహనానికి ప్రత్యేక ప్రత్యేక పూజలు చేసి దివ్యాంగుడు కంచుకట్ల సైదులుకు అందజేశారు.

ఆర్థిక సహాయం అందజేత

చండూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చండూరు మండలం పుల్లెంల గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన చాపల శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్‌రాంరెడ్డి గురువారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి, రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట గ్రామస్థులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌వో పోస్టు కోసం జోరుగా పైరవీలు

(5వ పేజీ తరువాయి)

స్థాయిలో అధికారులకు ఇటీవల ఎవరికీ ఇలాంటి ఎక్స్‌టెన్షన్ దక్కలేదని సీనియర్ అధికారులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయంలో సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్‌లో రిటైర్డ్ అయిన అధికారులు, ఉద్యోగులకు కొందరికి ఔట్‌సోర్స్ ఏజెన్సీల ద్వారా కన్సల్టెన్సీలుగా అవకాశాలిచ్చారని, కానీ అదే పోస్టులో కొనసాగించలేదని, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాల్లో వారిని నియమించారని చెబుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు ఎవరికీ ఇలాంటి ఎక్స్‌టెన్షన్ ఇవ్వలేదని, ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలన్నా, లేక కన్సల్టెన్సీగా నియమించాలన్నా చీఫ్ సెక్రటరీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, అంతస్థాయిలో ఈ అధికారి కోసం పనిచేస్తున్న లాబీ కృషి చేస్తుందా? ఆర్డర్ తెస్తుందా? అనే విషయంపై చర్చోపచర్చలు అధికార, ఉద్యోగవర్గాల్లో సాగుతోంది.

ఆరు రోజులుగా పోస్టు ఖాళీ

జిల్లాలో అత్యంత కీలకమైన డీఎస్‌వో పోస్టును ఆరు రోజుల పాటు ఎవరికీ బాధ్యతలివ్వకుండా ఖాళీగా ఉంచడంపై పలు రకాలుగా చర్చ సాగుతోంది. నిబంధనల ప్రకారం సదరు అధికారి ఫిబ్రవరి 28వ తేదీన ఉద్యోగ విరమణ చెందగా, ఆలోగా ఉత్తర్వులొస్తే కొత్త అధికారికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి కొత్త అధికారి నియామకం జరగకపోతే, అదే శాఖలో తదుపరి పోస్టులలో ఉన్నవారికి గానీ, లేక ఇతర శాఖల అధికారులకు గానీ తాత్కాలిక ఇన్‌చార్జీలుగా గానీ, ఎఫ్ఏసీగా గానీ బాధ్యతలు ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా రైస్‌మిల్లులు ఉండడం, ఈ మిల్లులతో నిత్యం సంప్రదింపులతో పాటు కీలకమైన సీఎంఆర్ కోటా బియ్యాన్ని రప్పించేందుకు మిల్లర్లు, అధికారులతో నిత్యం మానిటరింగ్ చేస్తూ, కలెక్టర్, అదనపు కలెక్టర్లకు సమాచారమిస్తూ ఉండాలి. అదేవిధంగా ఇప్పటికే ప్రభుత్వం గత ఏడాది వేలంలో విక్రయించిన బియ్యానికి సంబంధించిన లావాదేవీలు సక్రమంగా జరగలేదనే కారణంతో పాటు, మిల్లర్లు బియ్యం ఇవ్వడంలేదని ఓ వైపు, మిల్లర్లు ఇస్తామని చెప్పినా వేలంలో బియ్యం కొనుగోలు చేసిన సంస్థలు తీసుకోవడం లేదనే ఆరోపణలు మరోవైపు ఉన్నాయి. దీనిపై ఉన్నత స్థాయికి ఫిర్యాదులు వెళ్లడంతో నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన సందర్భం జిల్లాలో నెలకొని ఉంది. అదేవిధంగా నెల మొదటివారం కావడంతో రేషన్ సరఫరా జిల్లాలో సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాల్సి ఉంటుంది. మొదటి వారంలోనే మిల్లుల్లో పీడీఎస్ బియ్యం పట్టుబడిన ఘటనలూ వెలుగులోకి వచ్చాయి. ఇలా జిల్లాలో ఈ పోస్టులో ఉండే అధికారి నిత్యం ఎంతో కీలకమైన బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని, సీజన్‌లో అయితే సెలవు రోజుల్లో సైతం ఈ అధికారులు విధుల్లో ఉన్న సందర్భాలున్నాయని, అలాంటి పోస్టును సుమారు వారం రోజులుగా ఖాళీగా ఎందుకుంచుతున్నారోనని, దాని వెనక రాజకీయ, ఇతర బలమైన వర్గాల కారణాలేవైనా ఉండొచ్చనే సందేహాలు కూడా వెలువడుతున్నాయి. ఇప్పటికైనా ఈ చర్చకు ఫుల్‌స్టాప్ పెట్టేలా ఈ పోస్టులో కొత్త అధికారి నియామకం గానీ, లేకపోతే ఎవరో ఒకరికి ఇన్‌చార్జిగా అయినా బాధ్యతలివ్వాలని, లేకపోతే విమర్శలకు ఆస్కారమిచ్చినట్లు అవుతుందనే అభిప్రాయాలు అధికార, ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో బీజేపీ సంబురాలు

కేతేపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గెలుపొందడంతో గురువారం మండల కేంద్రం కేతేపల్లిలో బీజేపీ నాయకులు విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకట్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఉపాధ్యాయులు, పట్టభద్రులు తగిన శాస్తి చేశారని పేర్కొన్నారు. ఈ ఎన్నికలతో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.గోపి, టి.నర్సింహాచారి, కె.వెంకటేశ్వర్లు, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.విజయలక్ష్మి, పద్మ, జి.నరేష్, టి.అఖిల్, వి.సందీప్ పాల్గొన్నారు.


బాణసంచా కాల్చి నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆంధ్రజ్యోతి

*** ఇఫ్తార్ : 6.30 | సహర్ : 5.08 (శనివారం)

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శుక్రవారం 7 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 | కనిష్ఠం 21.6

డీఎస్‌వో పోస్టుకోసం

జోరుగా పైరవీలు



- తీవ్రంగా యత్నిస్తున్న ముగ్గురు అధికారులు
- ఎక్స్‌టెన్షన్ కోసం రిటైర్డ్ అధికారి సైతం
- వారం రోజులుగా ఎవరికీ బాధ్యతలివ్వకపోవడానికి కారణమేంటనే చర్చ
- రాష్ట్రంలోనే హాట్‌కేక్‌గా మారిన పోస్టు

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లా పౌరసర ఫరాలశాఖ అధికారి పోస్టు కోసం పెద్ద ఎత్తున పైరవీలు సాగుతున్నాయి. రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లా కావడం, కీలక మైన రైస్ ఇండస్ట్రీ ఈ జిల్లాలోనే ఉండడంతో ఈ పోస్టుకు ఇతర అన్ని జిల్లాల కంటే అత్యధిక ప్రాధాన్యం ఉంటుంది. ఇక్కడ డీఎస్‌వోగా పనిచేసేందుకు సీనియర్ అధికారులు సైతం కీలక మంత్రులు, ఉన్నతాధికారుల ఆశీస్సుల కోసం తాపత్రయపడుతుంటారు. ఈ పోస్టుకోసం సర్వీసులో ఉన్న అధికారులు ఓ వైపు ప్రయత్నిస్తుంటే, మరో వైపు ఇటీవలే ఉద్యోగ విరమణ చెందిన మరో అధికారి ఎక్స్‌టెన్షన్ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఆ శాఖలో ప్రచారం జరుగుతోంది. ఆయన ఉద్యోగ విరమణ చేసి వారం రోజులు గడుస్తున్నా కొత్త అధికారి రాకపోగా, కనీసం ఇన్‌చార్జిని సైతం నియమించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఉన్నతస్థాయిలో కీలక ప్రయత్నాలు

జిల్లా పౌరసరఫరాల అధికారి పోస్టు కోసం ఆ శాఖలో కీలకమైన అధికారులు ఉన్నతస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పోస్టు ఆశిస్తున్న ముగ్గురు అధికారులతో పాటు, ఉద్యోగ విరమణ చెందిన అధికారి సైతం ఎక్స్‌టెన్షన్ వస్తుందనే ఆశాభావంలో ఉన్నట్టు ఆధికారిక వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో గతంలో పనిచేసిన ఓ అధికారి అందుకోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తుండగా, మరో ఇద్దరు ఇతర జిల్లాల అధికారులు సైతం ఈ పోస్టు కోసం ఉన్నతాధికారులు, మంత్రుల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. ఉన్నతాధికారుల నుంచి ఈ ఆశావహులకు ఎలాంటి హామీ దక్కలేదని, గురువారం క్యాబినెట్ సమావేశం తర్వాత మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఖరారు చేయాల్సి ఉంటుందని, ఓ ఆశావహ అధికారికి, ఉన్నత స్థాయి అధికారి తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో పోస్టింగు ఖరారయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని సమాచారం.

ఎక్స్‌టెన్షన్ దక్కేనా..?

డీఎస్‌వోగా ఫిబ్రవరి 28 వరకు బాధ్యతలు నిర్వర్తించిన అధికారికి ఎక్స్‌టెన్షన్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు చర్చ సాగుతోంది. శాఖపై పట్టుండడంతో పాటు, కీలకమైన జిల్లా కావడంతో వివాదాల్లేకుండా నెట్టుకొచ్చిన ట్రాక్ రికార్డు ఉండడంతో ఆయన్ను కొనసాగించే అవకాశాలను పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారని చెబుతున్నారు. అయితే గత ప్రభుత్వం హయంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు మాత్రమే ఈ రకమైన సర్వీస్ ఎక్స్‌టెన్షన్ ఇచ్చారని, అదీ వారి సీనియారిటీని ఉపయోగించుకోవాలనే కారణాన్ని చూపుతూ ఉత్తర్వులిచ్చారని, జిల్లా

మిగతా 8వ పేజీలో...

పోలీస్ సేవలు



మరింత చేరువగా

- త్వరలో పెరగనున్న పోలీస్ స్టేషన్ల స్థాయి
- నేరాల సంఖ్య ఎక్కువగా నమోదవుతున్న స్టేషన్ల అప్‌గ్రేడ్
- ప్రత్యేకంగా ఏర్పాటుకానున్న సూర్యాపేట టూటౌన్ స్టేషన్
- సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంతో నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు
- జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా?



సూర్యాపేటక్రైం, మార్చి 6, (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు రాజీ లేకుండా విధులు నిర్వహిస్తున్నా రోజు రోజుకూ నేరాల సంఖ్య పెరుగుతూనే ఉంది. అంతేగాక తీవ్ర నేరాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిని అరికట్టాలంటే ప్రస్తుతం ఉన్న పోలీసులతో పాటు అదనంగా పోలీసులు, స్టేషన్లు అవసరం. దీంతో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పోలీస్ అధికారుల సమీక్షలో నేరాల సంఖ్య ఎక్కువగా ఉన్న స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయడం, అవసరం ఉన్న చోట నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న పోలీసులకు అదనంగా సిబ్బంది నియామకం చేపట్టాలని నిర్ణయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లు అప్‌గ్రేడ్ కానున్నాయి. దీంతో మహిళా పోలీస్‌స్టేషన్లు, సూర్యాపేట పట్టణంలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కానున్నాయి.

గతంలో ఉమ్మడి జిల్లాలో పని చేసిన ఎస్పీలు గత ప్రభుత్వానికి అప్‌గ్రేడ్ చేయాల్సిన స్టేషన్లు, నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుపై నివేదిక పంపారు. కానీ, అవి అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో త్వరలో ఈ ప్రతిపాదనలు అమలవుతాయని అంతా భావిస్తున్నారు.

పలు స్టేషన్ల అప్‌గ్రేడ్‌కు అవకాశం

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు సూర్యాపేట జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎస్ఐ ఎస్‌హెచ్‌వోగా కొనసాగుతున్న తిరుమలగిరి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, చివ్వెంల పోలీస్‌స్టేషన్లను ఎస్‌హెచ్‌వో ఇన్‌స్పెక్టర్ స్థాయికి పెంచనున్నారు. ఈ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏటా నేరాల సంఖ్య పెరగడంతో పాటు తిరుమలగిరి, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మునిసిపాలిటీలుగా ఏర్పడ్డాయి. దీంతో అక్కడ జనాభా పెరిగింది. చివ్వెంల పరిధిలో జాతీయ రహదారి 65, ఖమ్మం రహదారి, దంతాలపల్లి రహదారులున్నాయి. ఈ రహదారులపై నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతోపాటు చివ్వెంల మండల పరిధిలో నేరాల నమోదు కూడా ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు ఇప్పటికే జిల్లా ఎస్పీలు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. సూర్యాపేట రూరల్, కోదాడ పట్టణం, కోదాడ రూరల్, సూర్యాపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో సిబ్బందిని పెంచాలని, సూర్యాపేట టూటౌన్ స్టేషన్‌ను ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా అప్‌గ్రేడ్ చేయాలని ఇటీవల ప్రభుత్వానికి జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ నివేదికను పంపినట్లు సమాచారం.

పేటలో టూటౌన్ స్టేషన్

సూర్యాపేట పట్టణ జనాభా 1.50లక్షలకు పైగా చేరింది. అంతేగాక జిల్లా కేంద్రంగా ఏర్పాటైంది. నిత్యం వేల మంది వివిధ ప్రాంతాల నుంచి పలు పనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. గతంలో

మిగతా 7వ పేజీలో...

జానా ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో జానా, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీఎల్పీ మాజీ నేత కందూరు జానారెడ్డి నివాసానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జానా ఇంటికి వచ్చిన సీఎం సుమారు 30నిమిషాల పాటు ఆయనతో ఏకాంతంగా చర్చించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎంపిక, అదే విధంగా పలు అంశాలపై చర్చించినట్టు సమాచారం. అనంతరం జానా నివాసంలో సీఎం భోజనం చేసి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, జానా ఇంటికి వచ్చిన సీఎంను నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత బైరెడ్డి కోటిరెడ్డి కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు.

సెకండియర్‌లో 332మంది గైర్హాజరు



జిల్లా కేంద్రంలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభం కాగా, తొలి రోజు 332 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 13,295మంది విద్యార్థులకు 12,963మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 11,135మందికి 10,891మంది హాజరు కాగా, 244మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,160మంది విద్యార్థులకు 2,072మంది హాజరు కాగా, 88మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

పొరపాట్లు లేకుండా చూడాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఇంటర్ పరీక్షల సందర్భంగా ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సంరక్షకుడే భక్షకుడు?

నకిలీ పాస్‌పుస్తకాల దందాలో విలేజ్ ఫారెస్ట్ కమిటీ మాజీ సభ్యుడు

• 6లో..

కల్తీ రహిత ఆహారం అందేలా చూడాలి : కలెక్టర్

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు కల్తీ రహిత ఆహారం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆహార భద్రతశాఖ ఆధ్వర్యంలో నల్లగొండలో ఏర్పాటు చేసిన ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఆహార పదార్థాల్లో కల్తీ ఉందో లేదో అనే విషయంపై పరీక్షలు నిర్వహించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు రహదారుల పక్కన ఉన్న చిన్న వ్యాపారస్థులు, హోటళ్లలో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వ్యాపారులు, హోటళ్లు కల్తీ పదార్థాలు విక్రయించకుండా నివారించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ జోనల్ అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు వాహనాన్ని జిల్లాకు కేటాయించారని, ఈ వాహనం ద్వారా స్థానికంగా పరీక్షలు నిర్వహించి ఆహార నాణ్యతను నిర్ధారించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఆహార కల్తీపై ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు పి.స్వాతి, శివశంకర్‌రెడ్డి, ప్రభాకర్, పాల్గొన్నారు.

ఎంజీయూలో సదుపాయాల పరిశీలన

నీట్ పరీక్షా కేంద్రం ఏర్పాటు కోసం ఎంజీయూలో వసతులను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం పరిశీలించారు. వారివెంట రిజిస్ట్రార్ అల్వాల రవి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణప్రియ, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవరకొండ మున్సిపాలిటీతోపాటు అన్ని గ్రామాల్లో సరిపడా తాగునీటిని సరఫరా చేసేలా మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు తలెత్తితే ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించి వెంటనే నీటిని సరఫరా చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తిచేసినచోట వెంటనే ఫొటోలను తీసి పంపించాలని, సాంకేతిక సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించే ముందు మార్కింగ్ చేసి సంబంధిత శాసనసభ్యుల ద్వారా ప్రారంభించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ, వర్షాకాలంలో నియోజకవర్గ పరిధిలో కురిసిన వర్షాలకు అన్ని చెరువులు, కుంటల్లోకి నీరు పుష్కలంగా వచ్చిందని, వచ్చే జూన్ వరకు ఎలాంటి తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, అవసరమైతే అద్దె బోర్ల ద్వారా ప్రజలకు నీరందించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, మొదటి ప్రాధాన్యంలో పూర్తిగా ఇల్లులేనివారికి, గుడిసెలో నివసిస్తున్నవారికి కేటాయించడం జరుగుతుందన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, కనగల్): మండల కేంద్రమైన కనగల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బ్యాంక్ నూతన శాఖను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కనగల్‌తో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజల సౌకర్యార్థం బ్యాంక్ నూతన శాఖ ఏర్పాటు చేసిందన్నారు. ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఎస్‌టీపీ ద్వారా రుణాలు, రైస్‌మిల్లు, దాల్ మిల్లు వంటి పరిశ్రమలకు రుణాలు అందజేస్తామని, బ్యాంక్ ప్రతినిధుల ద్వారా మారు గ్రామాలకు సైతం సేవలను విస్తరింప జేస్తామని బ్యాంక్ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఆర్.సత్యనారాయణ, తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ కారే భాస్కర్‌రావ్, జడ్పీ మాజీ సభ్యుడు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ పద్మ, డిప్యూటీ రీజనల్ మేనేజర్ మురళీకృష్ణ, రాజేష్, రఘురాం, కోటేశ్వరరావ్, బ్యాంక్ మేనేజర్ మోహన్, ఈశ్వర్, చంద్రశేఖర్, సతీష్‌రెడ్డి, ఆర్ఐ సునిత, తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధనగిరిధారిగా..



స్వామివారిని ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది

- సింహవాహనంపై దర్శనమిచ్చిన దేవదేవుడు
- యాదగిరిగుట్టలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

• 6లో..

ఢిల్లీలో చేనేత కళాకారుల ప్రదర్శన

పాల్గొన్న జిల్లా వాసులు



రాష్ట్రపతి భవన్‌లో చేనేత వస్త్రాలను ప్రదర్శిస్తున్న జాతీయ అవార్డు గ్రహీత గంజి యాదగిరి

చండూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వివిధ్‌తాకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహిస్తున్న చేనేత కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శనను రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 20మంది చేనేత కళాకారులు ఈ ప్రదర్శనకు ఎంపిక కాగా, చండూరుకు చెందిన జాతీయ అవార్డు గ్రహీత గంజి యాదగిరి, జాతీయ మెరిట్ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసులు వారిలో ఉన్నారు. వీరు నైపుణ్యంతో తయారు చేసిన చేనేత ఉత్పత్తుల గురించి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వివరించారు. నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. పట్టణానికి చెందిన కళాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మత్తుకు బానిస కావద్దు



సమావేశంలో మాట్లాడుతున్న నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ భిక్షపతిరావు

రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ భిక్షపతిరావు

మర్రిగూడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిస కాకుండా భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని రాష్ట్ర నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ భిక్షపతిరావు అన్నారు. గురువార మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నార్కోటిక్స్ బ్యూరో సీఐ సామ్యనాయక్, ఎస్ఐ కృష్ణారెడ్డి, ఎంఈవో బిట్టు శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్..

కథ సుఖాంతం

• 6లో..

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

చింతపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని టీఎస్‌టీజీఎ్‌ఫసీ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన భవన కార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బాదేపల్లి పులిరాజ్‌గౌడ్, సందపట్ల రాజేష్‌సాగర్, రాముసాగర్, లక్ష్మణ్‌సాగర్, నాగరాజు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ

'ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

దేవరకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): దేవరకొండ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్ డిమాండ్ చేశారు. దేవరకొండకు వచ్చిన కలెక్టర్ ఇలా త్రిపాఠికి గురువారం వినతిపత్రం అందజేశారు. చదువుకోవడానికి వచ్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ చెత్తా, చెదారం తొలగింపు పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటినుంచి సాగరమాత తిరునాళ్లు

● మూడు రోజుల పాటు ఉత్సవాలు ● విద్యుత్ దీపాలతో సాగర్‌మాత దేవాలయం ముస్తాబు ● అధిక సంఖ్యలో హాజరుకానున్న భక్తులు



విద్యుత్ దీపాలతో ముస్తాబైన సాగర్‌మాత దేవాలయం

నాగార్జునసాగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ దక్షిణ విజయపురి(రైట్‌బ్యాంక్) వద్ద కృష్ణానది తీరంలో సాగరమాత పుణ్యక్షేత్రం కొలువై ఉంది. ఎలాంటి పాశ్చత్య పోకడలు లేని అచ్చమైన భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలకు అనుగుణంగా ఉన్న సాగరమాత దేవాలయాన్ని 1977లో నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం దేవాలయ నిర్మాణం పూరైన మార్చి 7, 8, 9వ తేదీల్లో ప్రతి సంవత్సరం తిరునాళ్లు ఘనంగా నిర్వహిస్తారు. 1980లో మారంరెడ్డి ఇన్నయ్య ఆధ్వర్యంలో దేవాల యం, దాని విశిష్టతను ప్రచారం చేశారు. 1996లో బిషప్ గాలి బాలీ ఆధ్వర్యంలో నూతన దేవాలయం(చర్చీ)ని నిర్మించారు. 2010 అక్టోబరు 23వ తేదీన 18 పరిశుద్ధ జపమాల క్షేత్రాలను అప్పటి గుంటూరు పిఠాధిపతులు గాలీ బాలీ, అప్పటి గుంటూరు ఎంపీ రాయపాటి సాంబశివరావు ప్రారంభించారు. ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మాతను దర్శించుకుంటారు. జపమాల క్షేత్రంలో ప్రార్థనలు చేస్తారు. హిందూ దేవాలయాల మాదిరిగానే తలనీలాలు సమర్పించడం, కొబ్బరి కాయలు కొడతారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ తిరునాళ్లకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు ఐదు లక్షల మంది భక్తులు తరలివ స్తారని విచారణ గురువులు(రెక్టర్) పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 5:30గంటలకు నవ దిన (తొమ్మిది రోజులు)జపములు జరుగుతాయని తెలిపారు.

సౌకర్యాలు: ఇక్కడికి వచ్చే భక్తులకు వసతి సౌకర్యాలకు దేవాలయం ఆధ్వర్యంలో నిర్మించిన అతిథి గృహంలో మొత్తం 20 గదులు ఉన్నాయి. రోజుకు రూ.200 చొప్పున అద్దెకు ఇవ్వనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయం అవరణలో నూతనంగా అన్ని హంగులతో నిర్మించిన మాతా సరోవర్‌లో కూడా గదులు అద్దెకు ఇవ్వనున్నట్లు నిర్వహకులు వీరారెడ్డి తెలిపారు. దీనిలో రోజుకు ఏసీ గదికి రూ.1,400, నాన్ ఏసీకి రూ.800 చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సు సౌకర్యం

ఇక్కడికి చేరుకోవడానికి హైదరాబాద్, నల్లగొండ నుంచి మాచర్లకు వెళ్లే బస్సులు రైట్‌బ్యాంకు ఎక్స్ రోడ్డు(చెక్‌పోస్టు) వద్ద ఆగుతాయి. అక్కడ నుంచి ఆటోల్లో సాగరమాత దేవాలయానికి చేరుకోవచ్చు.



కృష్ణానది తీరంలో ఉన్న జపమాలలు

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్న ప్రభుత్వం



శంకుస్థాపన చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు శ్రీను

నాగార్జునసాగర్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోందని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ నాయకుడు ఉంగరాల శ్రీను అన్నారు. నాగార్జున సాగర్‌లో నందికొండ మునిసిపాలిటీ పరిధిలో ఒకటో వార్డులో సీసీ రోడ్లకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి 1వ వార్డుకు సీసీ రోడ్డును మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పగడాల నాగరాజు, రామకృష్ణ, ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

చింతపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. మండలకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు నాణ్యత లేకుండా నిర్వహించడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, అంగిరేకుల గోవర్ధన్, ముచ్చర్ల యాదగిరి, హరినాయక్, రవినాయక్, గుండ్లపల్లి నరసింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తిరుమలగిరి(సాగర్), మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి గ్రామంలో పింఛన్ పంపిణీ కార్యక్రమానికి వెళ్లి పెన్షనర్లతో ముఖాముఖి నిర్వహించారని హెచ్ఎం పరిక అంజిబాబు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై పట్టుదల పెరిగి ఉన్నతంగా ఆలోచించి చదవడానికి వీలు ఉంటుందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తావుర్యా, రామాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిటీపై ప్రజలకు అపోహలు కల్పించొద్దు



హైకోర్టు ఉత్తర్వుల ప్రతిని చూపుతున్న మజీద్ కమిటీ సభ్యులు

మిర్యాలగూడ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులతో మజీద్ కమిటీపై అపోహాలు కల్పించొద్దని సరికాదని మీనా కళాశాలల వ్యవస్థాపకుడు మజీద్ సరాయే మీర్ఆలం కమిటీ చైర్మన్ మహ్మామూద్ అలీ అన్నారు. వక్ఫ్‌బోర్డు భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఒకరు రూ.2 లక్షలు, మరొకరు రూ2.60లక్షలు బాకి ఉన్నారని వాటిని అడిగినందుకు లేనిపోనివి కల్పించి అధికారులకు ఫిర్యాదు చేసి మజీద్ కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటింపజేశారన్నారు. కమిటీ రద్దు ప్రకటించిన నాలుగు రోజుల్లోనే మజీద్‌లోని సీసీ కెమెరాల ప్లగ్‌లను, కేబుల్స్‌ను ధ్వంసం చేశారని అన్నారు. కమిటీని రద్దు చేసే, నియమించే అధికారం ఎవరికీ లేదని కేవలం వక్ఫ్‌బోర్డు సమావేశంలో నిర్ణయిస్తారని తెలిపారు. పాత కమిటీని రద్దుచేసిన విషయమై హైకోర్టును ఆశ్రయించగా పాత కమిటీకే తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు ఆదేశాల పత్రాలను సమావేశంలో ప్రదర్శించారు. సమావేశంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ చాహూస్, సభ్యులు మహ్మద్ ఖైసర్, మన్నన్, యూసూఫ్ షరీఫ్, నవాజ్ బీస్ మహ్మద్, ఎండి. బాబుజానీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పాస్ పుస్తకాలు ఇవ్వాలి



నర్సాపురంలో సభ్యత్వాలు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

దామరచర్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ పాస్ పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ . బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని నర్సాపురం గ్రామంలో గురువారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండుసార్లు పార్ట్-బీ సర్వే చేయించి రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ అర్హులందరికీ పట్టా పుస్తకాలు ఇవ్వాలన్నారు. రైతులు పండించిన మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని అన్నారు. మిర్చి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్లా కనకయ్య, ధీరావత్ లింగానాయక్, దస్రు, ఎల్లమ్మ, చెంప్ల, రాగ్యాకుమారి, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవూర, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిచర్ల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌వో నీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు పులిచర్ల ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న నీటిబోరులో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బ్యాంక్ అధికారులు స్పందించి సోషల్ వెల్ఫేర్ కార్పస్ ఫండ్ నుంచి ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థుల తొలగించాలని కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రూ.2.50లక్షల విలువైన ఆర్‌వో నీటి ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానని బ్యాంక్ మేనేజర్ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో హెచ్ సుదర్శన్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు బుడిగపాక సత్యనారాయణ, బొడ్డుపల్లి చిరంజీవి, మునినాయక్, ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కొండమల్లేపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. కొండమల్లేపల్లిలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 263మందికి గాను 255 మంది హాజరయ్యారు. శ్రీ క్రాంతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 171మంది విద్యార్థులకు గాను 170 మంది హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.

పాస్ పుస్తకాలు ఇప్పిస్తామంటే నమ్మొద్దు

● తహసీల్దార్ అనిల్

తిరుమలగిరి(సాగర్), మార్చి 6(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడలో నకిలీ పాస్‌పుస్తకాల అంశంలో తిరుమలగిరి(సాగర్) మండలానికి లింక్ ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో పట్టా పాస్ పుస్తకాల విషయంలో దళారుల మాటలు నమ్మవద్దని తహసీల్దార్ అనిల్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో పైలట్ ప్రాజెక్టు విజయవంతంగా పూర్తయిందని, అందులో భాగంగా అన్ని గ్రామాల్లో సర్వే టీంలు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పకడ్బందీ ఖాస్తు కబ్జాను నిర్ధారించేందుకు సర్వే చేసినట్లు తెలిపారు. అందుకు తగ్గట్లుగా ప్రతి గ్రామంలో అర్హులైన రైతుల వివరాలను ఆయా గ్రామపంచాయతీల్లో గతంలోనే నోటీసు బోర్డుల్లో ఉంచినట్లు తెలిపారు. కాని కొందరు దళారులు, అక్రమార్కులు మండలంలోని పలు గ్రామాల్లో ఫారెస్ట్, ప్రభుత్వ భూములకు డబ్బులు ఇస్తే పట్టా పాస్ పుస్తకాలు ఇప్పిస్తామని అమాయకులను మభ్యపెడుతున్నట్లు తెలిసిందన్నారు. ఎలాంటి అక్రమాలకు, అవకతవకలకు తావు లేకుండా అర్హులైన రైతులకు త్వరలోనే అధికారికంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణి చేస్తామని ఈ విషయంలో రైతులు దళారుల మాటలను నమ్మి మోసపోవద్దని ఆయన తెలిపారు. ఎవరైనా దళారులు పట్టా పాస్‌పుస్తకాలు ఇస్తామని చెప్తే వారి సమాచారం రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని, అక్రమార్కులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పల్లె ప్రకృతి వనంలో మొక్కలు దగ్ధం



పల్లె ప్రకృతి వనంలో దగ్ధమైన మొక్కలు

కొండమల్లేపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంగోతుతండా గ్రామపంచాయతీలోని పల్లెప్రకృతి వనంలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రగల్చడంతో పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు దగ్ధమయ్యాయి. సుమారు 30గుంటల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలోని రూ.4.60లక్షలు వెచ్చించి గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం సాయంత్రం బీడీ తాగి పక్కన పడివేయడంతో ఎండు గడ్డి కారణంగా మంటలు వ్యాపించి పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు కాలిపోయాయని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



మిర్యాలగూడలో స్వీట్లు పంచుకుంటున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకులు కనపర్తి సత్యప్రసాద్, బంటు సైదులు అన్నారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలు కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల పట్ల అన్నివర్గాల ప్రజలు విముఖత చూపుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇండస్ట్రియల్ సెల్ జిల్లా కన్వీనర్ తల్లం అశోక్, ఎడ్ల రమేష్, వెంకటరమణ, బొట్టు సైదులు, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణ, శేఖర్, రవికుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో బీజేపీ నాయకులు మండల కేంద్రంలో గురువారం సంబరాలు నిర్వహించారు. సాగర్-హైదరాబాద్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్, నాయకులు కుక్కడపు రామకృష్ణ, ధరణిపతి రమాణరావు, వెన్నం శేఖర్, బొడ్డు మహేష్‌గౌడ్, కుందేళ్ల చెన్నయ్య, నాల శివకుమార్, గజ్జి అభినవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి బహుమతి



కొండమల్లేపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ సంస్థ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరంలో నిర్వహిం చిన ఐఐటీ విభాగం పరీక్షలో కొండమల్లేపల్లిలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి ఎం. అర్జున్ 7వ తరగతి విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ మేరకు శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ పాఠశాల ఐఐటీ ఫిజిక్స్ టీచర్ జి. ప్రసాద్‌కు గురువారం ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆంథోని రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు మల్లె రమేష్ బహుమతి అందజేశారు. పాఠశాల కరెస్పాండెంట్ కట్టా వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు



నారమ్మగూడెంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

నిడమనూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారమ్మగూడెం గ్రామంలో సీతారామ, వేంకటేశ్వర, శివాలయం ఆలయాల్లో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠోత్సవాలు గురువారం ముగిశాయి. మూడు రోజుల పాటు మూడు ప్రధాన ఆలయాల్లో విఘ్నేశ్వర పూజ, చండీయాగం, రుద్రాభిషేకం, క్షీరాదివాసం తదితర కార్యక్రమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మేళ్లచెరువుకు చెందిన ప్రముఖ యజ్ఞప్రతీక కొంకపాక రాధాకృష్ణమూర్తి, గుడె లక్ష్మీనర్సయ్య పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. బుసిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ఆలయాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. భక్తులకు మహాఅన్నదానం చేశారు. ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ బైరెడ్డి సత్తిరెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి, బైరెడ్డి వెంకట్‌రెడ్డి, గడ్డం గోవిందరెడ్డి, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి, వల్లభ్‌రెడ్డి, అంకతి సత్యం, నందికొండ మట్టారెడ్డి, శివమారయ్య, సైదిరెడ్డి, సీతారాంరెడ్డి, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం



దాసరినెమలిపూర్ గ్రామంలో రథాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

డిండి: మండలంలోని దాసరినెమలిపూర్ గ్రామంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన బ్రహోత్సవాలు గురువారం ముగిశాయి. తెల్లవారుజామున కల్యాణ వేంకటేశ్వరస్వామి రథాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గంగిడి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు పూర్ణాహుతి, అవబృతస్నానం, ఏకాంతసేవతో ముగిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహారావు, గంగిడి నరేందర్‌రెడ్డి, పాలకొల్లు బాలయ్య, గంగిడి మాధవరెడ్డి, రామచంద్రం, జాహంగీర్, కొండల్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌వో పోస్టు కోసం జోరుగా పైరవీలు

(5వ పేజీ తరువాయి)

స్థాయిలో అధికారులకు ఇటీవల ఎవరికీ ఇలాంటి ఎక్స్‌టెన్షన్ దక్కలేదని సీనియర్ అధికారులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయంలో సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్‌లో రిటైర్డ్ అయిన అధికారులు, ఉద్యోగులకు కొందరికి ఔట్‌సోర్స్ ఏజెన్సీల ద్వారా కన్సల్టెన్సీలుగా అవకాశాలిచ్చారని, కానీ అదే పోస్టులో కొనసాగించలేదని, ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాల్లో వారిని నియమించార ని చెబుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు ఎవరికీ ఇలాంటి ఎక్స్‌టెన్షన్ ఇవ్వలేదని, ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలన్నా, లేక కన్సల్టెన్సీగా నియమించాలన్నా చీఫ్ సెక్రటరీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, అంతస్థాయిలో ఈ అధికారి కోసం పనిచేస్తున్న లాబీ కృషి చేస్తుందా? ఆర్డర్ తెస్తుందా? అనే విషయంపై చర్చోపచర్చలు అధికార, ఉద్యోగవర్గాల్లో సాగుతోంది.

ఆరు రోజులుగా పోస్టు ఖాళీ

జిల్లాలో అత్యంత కీలకమైన డీఎస్‌వో పోస్టును ఆరు రోజుల పాటు ఎవరికీ బాధ్యతలివ్వకుండా ఖాళీగా ఉంచడంపై పలు రకాలుగా చర్చ సాగుతోంది. నిబంధనల ప్రకారం సదరు అధికారి ఫిబ్రవరి 28వ తేదీన ఉద్యోగ విరమణ చెందగా, ఆలోగా ఉత్తర్వులొస్తే కొత్త అధికారికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి కొత్త అధికారి నియామకం జరగకపోతే, అదే శాఖలో తదుపరి పోస్టులలో ఉన్నవారికి గానీ, లేక ఇతర శాఖల అధికారులకు గానీ తాత్కాలిక ఇన్‌చార్జీలుగా గానీ, ఎఫ్ఏసీగా గానీ బాధ్యతలు ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా రైస్‌మిల్లులు ఉండడం, ఈ మిల్లులతో నిత్యం సంప్రదింపులతో పాటు కీలకమైన సీఎంఆర్ కోటా బియ్యాన్ని రప్పించేందుకు మిల్లర్లు, అధికారులతో నిత్యం మానిటరింగ్ చేస్తూ, కలెక్టర్, అదనపు కలెక్టర్లకు సమాచారమిస్తూ ఉండాలి. ఇప్పటికే ప్రభుత్వం గత ఏడాది వేలంలో విక్రయించిన బియ్యానికి సంబంధించిన లావాదేవీలు సక్రమంగా జరగలేదనే కారణంతో పాటు, మిల్లర్లు బియ్యం ఇవ్వడంలేదని ఓ వైపు, మిల్లర్లు ఇస్తామని చెప్పినా వేలంలో బియ్యం కొనుగోలు చేసిన సంస్థలు తీసుకోవడం లేదనే ఆరోపణలు మరోవైపు ఉన్నాయి. దీనిపై ఉన్నతస్థాయికి ఫిర్యాదులు వెళ్లడంతో నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన సందర్భం జిల్లాలో నెలకొని ఉంది. నెల మొదటివారం కావడంతో రేషన్ సరఫరా జిల్లాలో సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాల్సి ఉంటుంది. మొదటి వారంలోనే మిల్లుల్లో పీడీఎస్ బియ్యం పట్టుబడిన ఘటనలూ వెలుగులోకి వచ్చాయి. ఇలా జిల్లాలో ఈ పోస్టులో ఉండే అధికారి నిత్యం ఎంతో కీలకమైన బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని, సీజన్‌లో అయితే సెలవు రోజుల్లో సైతం విధుల్లో ఉన్న సందర్భాలున్నాయని, అలాంటి పోస్టును సుమారు వారం రోజులుగా ఖాళీగా ఎందుకుంచుతున్నారోనని, దాని వెనక రాజకీయ, ఇతర బలమైన వర్గాల కారణాలేవైనా ఉండొచ్చనే సందేహాలు కూడా వెలువడుతున్నాయి.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న నాయకులు

నాగార్జునసాగర్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్ కాలనీ, పైలాన్ కాలనీల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మహారాజుల సంఘం ఆధ్వర్యంలో పేబ్యాగ్ సొసైటీలో భాగంగా గురువారం పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహారాజుల సంఘం నాయకులు బద్రి, పులాకలరావు, వీరబాబు, నకుల్‌రావు, శ్రీనివాస్, శశిధర్, మోహన్, శివ, శివరాంప్రసాద్, నాగారాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.